ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

చిత్తూరు జిల్లా వార్తలు

శుక్రవారం 29 నవంబరు 2024





బతుకు వేట

మాసిన గడ్డాలు, నలిగిపోయిన బట్టలు, కాలికి అంటిన సిమెంటు మరకలతో ఇక్కడున్న వారంతా బేల్దారి పనుల కోసం ఎదురుచూస్తున్న కూలీలు. రోజూ ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు పనుల కోసం కూలీలు ఇక్కడ గుమికూడి ఎదురుచూస్తారు.చిత్తూరు నగరమే కాకుండా యాదమరి, బంగారుపాళ్యం, గుడిపాల, జీడీ నెల్లూరు, పూతలపట్టు ప్రాంతాల నుంచి రోజూ 150మంది కూలీలు ఉదయం లేవగానే చిత్తూరు చర్చివీధిలోని మార్కెట్ చౌక్‌కు చేరుకుంటారు. నగరంలో జరుగుతున్న పనుల కోసం కాంట్రాక్టర్లు, మేస్త్రీలు అక్కడకొచ్చి అవసరమైనంత మంది కూలీలను ఆటోల్లో, ద్విచక్రవాహనాలపై తీసుకెళతారు.పనులు దొరకనివారు అక్కడే మధ్యాహ్నం వరకు ఉండి వెంటతెచ్చుకున్న భోజనాన్ని అక్కడే తిని ఇళ్లకు వెళతారు.

- ఆంధ్రజ్యోతి, చిత్తూరు

అంగరంగ వైభవం

అమ్మవారి బ్రహ్మోత్సవం

6లో



అనుబంధం



భైరెడ్డిపల్లెలోని ఓ ఇంటిగోడపై ఈ జంట వానరాల అన్యోన్యత చూడముచ్చటగా అనిపించింది.మనస్పర్థలు, విభేదాలు, కోపతాపాలతో రగిలిపోతుండే జనం ఈ మూగజీవాలను చూసి ఎంతో నేర్చుకోవాల్సి వుంది.

- భైరెడ్డిపల్లె, ఆంధ్రజ్యోతి

కూటమి సర్కారు కట్టడి

గంజాయి అదుపునకు

నార్కోటిక్ కంట్రోల్ సెల్

చిత్తూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో విపరీతంగా పెరిగిన గంజాయి రవాణా, అమ్మకాలను పూర్తిగా కట్టడి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. వచ్చే ఆరు నెలల్లో గంజాయి కనిపించకుండా చేయడమే లక్ష్యంగా ముందుకెళుతోంది.తాజాగా గంజాయి సాగు, రవాణా, విక్రయాల్లో నిందితులకు సంక్షేమ పథకాలు కట్ చేస్తామని ప్రకటించింది. ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్)ను ఏర్పాటు చేసిన ప్రభుత్వం గంజాయిని ఎలా కట్టడి చేయాలో సూచిస్తూ గురువారం ఉత్తర్వులను విడుదల చేసింది. అమరావతి కేంద్రంగా నార్కోటిక్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసి, డీఎస్పీ ఆధ్వర్యంలో 66మంది సిబ్బంది పనిచేసేలా ఉత్తర్వులిచ్చారు. ఇదే క్రమంలో జిల్లాల్లోనూ డిస్ట్రిక్ నార్కోటిక్ కంట్రోల్ సెల్స్ ఏర్పాటు చేయనున్నారు. మన జిల్లాలోనూ ఈ సెల్ బాధ్యతలను ఓ ఎస్‌ఐ ఆధ్వర్యంలో ఓ హెడ్ కానిస్టేబుల్, ముగ్గురు కానిస్టేబుళ్లు నిర్వహించనున్నారు.

ఇప్పటికే టీమ్ పనిచేస్తోంది

గంజాయిని అరికట్టేందుకు మన జిల్లాలోనూ నార్కోటిక్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేస్తాం.ఇప్పటికే గంజాయిని అరికట్టేందుకు జిల్లాలో టాస్క్‌ఫోర్స్ టీమ్ పనిచేస్తోంది. నార్కోటిక్ కంట్రోల్ సెల్ ఏర్పాటుతో.. గంజాయిని ఓ చోట పట్టుకుంటే దాని చైన్ లింకుల్ని వెతుక్కుంటూ వెళ్లి పూర్తిగా అంతం చేస్తాం.

- మణికంఠ, చిత్తూరు ఎస్పీ

వైసీపీ హయాంలో పెరిగిన విక్రయాలు

వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో మన జిల్లాలోనూ గంజాయి అమ్మకాలు, వాడకం విపరీతంగా పెరిగింది.2014-19సంవత్సరాల మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో 17 కేసుల్లో 62 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో 169 కేసుల్లో ఏకంగా 1166 కిలోల గంజాయిని పట్టుకున్నారు. అప్పట్లో 45 మందిని అరెస్టు చేస్తే.. వైసీపీ హయాంలో 496 మంది అరెస్టయ్యారు. జిల్లామీదుగా సరఫరాతో పాటు జిల్లావాసులు కూడా పెద్దఎత్తున గంజాయి వాడుతున్నారనే విషయం ఆందోళనకు గురిచేస్తోంది. చిత్తూరు, పలమనేరు, పుంగనూరు వంటి పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గంగవరం, పెద్దపంజాణి, కుప్పం, రామకుప్పం, వి.కోట వంటి ప్రాంతాల్లో గంజాయిని సాగు కూడా చేసేవారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది.ఎస్పీ మణికంఠ ఆధ్వర్యంలో సివిల్ డ్రస్సులు ధరించిన పోలీసు బృందాలు రైల్వే స్టేషన్లు, బస్టాండుల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. అటవీ శాఖ అధికారుల సమన్వయంతో వి.కోట, రామకుప్పం ప్రాంతాల్లో సాగులో ఉన్న గంజాయి మొక్కలను గుర్తించారు.







లాటరీల నియంత్రణకు

పోలీసు దాడులు

చిత్తూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):లాటరీ టికెట్ల అమ్మకాలపై పోలీసులు దృష్టి సారించారు. వైసీపీ హయాంలో విచ్చలవిడిగా జరిగిన లాటరీ టికెట్ల అమ్మకాలను కూటమి ప్రభుత్వం కట్టడి చేస్తోంది. గత సోమవారం జిల్లా ప్రత్యేక విభాగ పోలీసులు పలమనేరు, పుంగనూరు, బంగారుపాళ్యం ప్రాంతాల్లో దాడులు చేసి ఏకంగా రూ.13 లక్షల విలువ చేసే 22 వేల టికెట్లను స్వాధీనం చేసుకున్నారు.

లాటరీ టికెట్ల నిర్వహణ ఇలా

రూ.20, 50, 100, 200, 250, 500 చొప్పున విక్రయించే లాటరీ టికెట్ల వ్యాపారం జిల్లా కేంద్రం చిత్తూరు సహా.. పలమనేరు, పుంగనూరు, బంగారుపాళ్యం ప్రాంతాల్లో ఎక్కువగా జరిగేది.రోజూ ఉదయం టికెట్లను అమ్మి సాయంత్రం 5 గంటలకు ఫలితాలను వెల్లడించేవారు. తమిళనాడు రాష్ట్రంలోని గుడియాత్తం, వేలూరు ప్రాంతాల్లో లాటరీ టికెట్ల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలున్నాయి. అక్కడి నుంచి టికెట్లను తెచ్చుకుని జిల్లాలో విక్రయిస్తుంటారు. ఒక్కసారి లాటరీ తగిలినా తమ బతుకులు బాగుపడిపోతాయని ఆశపడే అమాయకులే వీరి ఖాతాదారులు.పోలీసులు కూడా నెల మామూళ్లు తీసుకుని నిర్వాహకుల జోలికి వెళ్లేవారు కాదు.నిర్వాహకుల వెనుక రాజకీయ నాయకులుండి, వచ్చిన డబ్బుల్లో సింహభాగం తీసుకునేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. పరిస్థితి మారింది. జిల్లా కేంద్రమైన చిత్తూరులో ఐదు నెలలుగా లాటరీ నిర్వహణ లేదు.కొందరు టీడీపీ నాయకులు నిర్వహించాలని చూసినా.. ఎమ్మెల్యే జగన్మోహన్ కల్పించుకుని ఆపేయించారు. పుంగనూరు, పలమనేరు, బంగారుపాళ్యం ప్రాంతాల్లో లాటరీ టికెట్ల అమ్మకాలు జరుగుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీంతో సోమవారం వారు ఆయా ప్రాంతాల్లో దాడులు చేశారు. పుంగనూరులోని తూర్పు మొగశాల, కేకేనగర్, బంగారుపాళ్యం, పలమనేరుల్లో రూ.13 లక్షల విలువ చేసే 22 వేల టికెట్లను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసులు పెట్టారు.లాటరీ టికెట్ల అమ్మకాలను పూర్తిగా నియంత్రించే దిశగా పోలీసు శాఖ ముందుకెళుతోంది.

బోయకొండ గంగమ్మకు రూ.69.17 లక్షల ఆదాయం

చౌడేపల్లె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బోయకొండ గంగమ్మ ఆలయానికి హుండీ లెక్కింపు ద్వారా రూ.69.17 లక్షలు ఆదాయం చేకూరినట్లు ఈవో ఏకాంబరం వెల్లడించారు. గురువారం ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు.57 రోజులకు గానూ రూ.69,17, 185, 38 గ్రాముల బంగారు,350 గ్రాముల వెండితో పాటు విదేశీ కరెన్సీ కానుకలుగా వచ్చాయి. అదేవిధంగా రణభేరి గంగమ్మ దేవస్థానానికి రూ.45,844 కానుకల రూపంలో అందింది.దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.శశికుమార్, ఐసీఐసీఐ బ్యాంకు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

ఆ అభియోగాలపై వివరణ ఇవ్వండి

రిటైర్డ్ జడ్పీ సీఈవో ప్రభాకరరెడ్డిని ఆదేశించిన ప్రభుత్వం

10 రోజుల్లో వివరణ ఇవ్వకుంటే చర్యలు తప్పవని హెచ్చరిక

చిత్తూరు రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):జడ్పీ మాజీ సీఈవో ప్రభాకర రెడ్డిపై వచ్చిన అభియోగాలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది.ఆయనపై వచ్చిన 9 ఆరోపణలపై రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని, 10 రోజుల్లోపల వివరణ పంపకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.2008 నుంచి 2017 వరకు జడ్పీలో ప్రభాకరరెడ్డి సూపరింటెండెంట్‌గా పనిచేశారు. ఆ తర్వాత ఎంపీడీవోగా ప్రమోషన్ వచ్చి బైరెడ్డిపల్లికి బదిలీ అయినా తిరిగి డిప్యుటేషన్‌పై జడ్పీలోనే ఓఎస్డీగా కొనసాగారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక మంత్రి పెద్దిరెడ్డి అండతో ఏక కాలంలో జడ్పీ ఏవోగా, డిప్యూటీ సీఈవోగా,ఇన్‌ఛార్జి సీఈవోగా పనిచేసిన ఘనత ఆయనది.దాదాపు పదేళ్లు ఏ పార్టీ అధికారంలో వున్నా జిల్లాపరిషత్‌లో ప్రభాకర రెడ్డి ఆడింది ఆట, పాడింది పాటగా నడిచింది. రికార్డు అసిస్టెంట్ నుంచి ఎంపీడీవో వరకూ ఎవరినైనా తనకు నచ్చకపోతే వేధించేవారని, రాత్రి 11 గంటల వరకూ కార్యాలయంలో ఉంచి పనిచేయించేవారని చెప్పుకునేవారు.జడ్పీ కార్యాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఉద్యోగులను వేధించేవారని , చివరకు టాయిలెట్స్ వద్ద కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఇబ్బందులకు గురిచేశారన్న విమర్శలున్నాయి. ప్రభాకర రెడ్డి వేధింపుల కారణంగా నాగలాపురం ఎంపీడీవో బాలగణేష్, జడ్పీలో సీనియర్ అసిస్టెంట్ పురుషోత్తంరెడ్డి, టైపిస్ట్ కెనడి, రికార్డ్ అసిస్టెంట్ యుగంధర్ ఏకంగా ప్రాణాలే కోల్పోయారని జడ్పీ ఉద్యోగులే పీఆర్ కమిషనర్‌కు గతంలో ఫిర్యాదు చేశారు.రెండు రోజుల్లో రిటైరవుతారనగా ప్రభాకర రెడ్డి సస్పెండయ్యారు. అప్పట్నుంచీ ఆయన ఎవరికీ కనపడలేదు.ఆయనపై వచ్చిన ఫిర్యాదులను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది.మొత్తం 9 అభియోగాలపై వివరణ ఇవ్వాలని గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 10 రోజుల్లో వివరణ ఇవ్వకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. జడ్పీ జనరల్ ఫండ్స్ నుంచీ ఎటువంటి ఆమోదం లేకుండా సుమారు రూ.19.19 లక్షలు వి.కోట మండం పత్రపల్లి కొత్తూరులోని జడ్పీ ఛైర్మన్ క్యాంపు కార్యాలయ నిర్వహణకు వెచ్చించడం, జిల్లా పరిషత్‌లో విధుల నిర్వహణకు సుమారు ఐదు అద్దె వాహనాలను వాడి రూ. 17.55 లక్షల అద్దె చెల్లించడం, 15వ ఆర్థిక సంఘ నిధుల నుంచి అత్యధిక శాతం పనులను పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాలకే కేటాయించడం, 1124 పనులకు గాను సుమారు రూ.78.13 కోట్లు ఖర్చు పెట్టించడం,జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాల నిర్వహణకు సభ్యుల ఆమోదం లేకుండా జనరల్ ఫండ్స్ నుంచి సుమారు రూ.35.61 లక్షలు ఖర్చు చేయడం, జడ్పీ క్వార్టర్స్ మరమ్మతుల కోసం ఒకే పనిని మూడుగా విభజించి ఒక్కో పనికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.15 లక్షలు అంచనా వేసి ఎటువంటి పనులు చేయకుండానే రూ.3.51 లక్షలు చెల్లించడం ఆయనపై వచ్చిన అభియోగాల్లో కొన్ని. జడ్పీలోని కొంత మంది ఉద్యోగులకు ఎటువంటి కారణాలు చూపకుండా వార్షిక గ్రేడ్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయలేదని, వేతనాల ఫిక్సేషన్ కూడా ఆలస్యం చేశారని, వారి సర్వీస్ రిజిస్టర్లను ప్రభుత్వానికి పంపలేదని, ఇంకొంత మందికి చివరి వేతన ధ్రువీకరణ పత్రాలను కూడా జారీ చేయలేదని ఆయనపై అభియోగాలున్నాయి.జడ్పీలో పనిచేస్తున్న ముగ్గురు ఏవోలను,ఐదుగురు సిబ్బందిని ఎటువంటి కారణాలు చూపకుండా సస్పెండ్ చేశారని, వారికి సస్పెన్షన్ సమయంలో జీవనాధార భత్యం కూడా మంజూరు చేయకుండా ఇబ్బందులకు గురిచేశారని కూడా అభియోగాలున్నాయి.







నారా రామ్మూర్తికి

ఘన నివాళి

పలువురు రాజకీయ ప్రముఖుల హాజరు

సీఎం చంద్రబాబు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడి కర్మక్రియలు గురువారం నారావారిపల్లెలో జరిగాయి. సీఎం చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, తనయుడు, మంత్రి లోకేశ్‌తో పాటు నారా, నందమూరి కుటుంబ సభ్యులు, ప్రముఖులు నివాళులర్పించారు. ఆయనతో తమ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలోని వ్యవసాయ బావి వద్ద రామ్మూర్తి నాయుడు కుమారులు నారా రోహిత్, గిరీష్‌తో పాటు చంద్రబాబు కుటుంబ సభ్యులు హిందూ సంప్రదాయ ప్రకారం పెద్దకర్మ నిర్వహించారు. ఆ తర్వాత సభావేదికపై రామ్మూర్తి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. భోజనశాలకు వెళ్లి ఏర్పాట్లను సీఎం పరిశీలించారు. అందరినీ ఆత్మీయంగా పలకరించాక అక్కడనుంచి తిరిగి ఇంటికి చేరుకున్నారు.

శివాలయానికి వెళ్లి..

సీఎం చంద్రబాబునాయుడు, నారా భువనేశ్వరి, మంత్రి లోకేశ్, రామ్మూర్తినాయుడి సతీమణి ఇందిర, నారా గిరీష్, నారా రోహిత్, సీఎం సోదరి హైమావతి తదితరులు గురువారం సాయంత్రం శేషాపురం వద్ద శేషాచల లింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. టీటీడీ అధికారులు సాదరంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

సీఎం పరామర్శ

నారావారిపల్లెలో ఇటీవల మృతిచెందిన నారా చిన్నబ్బనాయుడి ఇంటికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. చిన్నబ్బ సతీమణి సావిత్రి, కుమారుడు నారా కిరణ్‌ను పరామర్శించారు. కందులవారిపల్లెలో ఇటీవల మృతిచెందిన పులివర్తి హరిహరచౌదరి ఇంటికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను చంద్రబాబు పరామర్శించారు. సంప్రదాయం ప్రకారం రాత్రి నారా గిరీష్, నారా రోహిత్ గ్రామంలోని అన్ని ఇళ్లకు వెళ్లి దీపం చూశారు.

హాజరైన ప్రముఖులు.. స్థానికులు

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు, మంత్రులు కె.అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్ రెడ్డి, కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, ఎం.రాంప్రసాదరెడ్డి, వి.అనిత, ఎస్.సవిత, వాసంశెట్టి సుభాష్, కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, సిపాయి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి (పలమనేరు), కిశోర్‌కుమార్‌రెడ్డి (పీలేరు), మురళి (పూతలపట్టు), పులివర్తి నాని (చంద్రగిరి), ఆదిమూలం (సత్యవేడు), గాలి భానుప్రకాష్ (నగరి), గురజాల జగన్మోహన్ (చిత్తూరు), బొజ్జల సుధీర్ రెడ్డి (శ్రీకాళహస్తి), షాజహాన్ బాషా (మదనపల్లె), దూళిపాళ్ల నరేంద్ర (పొన్నూరు), నెలవల విజయశ్రీ (సూళ్లూరుపేట), థామస్ (గంగాధర నెల్లూరు) శ్రీనివాసులు (రాయదుర్గం), మాజీ మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీలు బుద్దా వెంకన్న, దొరబాబు, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, సీకే బాబు, ఏఎస్ మనోహర్, నెలవల సుబ్రహ్మణ్యం, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, శాప్ ఛైర్మన్ రవి నాయుడు,టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, కార్పొరేటర్లు ఆర్సీ మునికృష్ణ, అన్నా అనిత, నరసింహాచారి, కూటమి పార్టీల నేతలు, శ్రేణులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు.

- తిరుపతి/చంద్రగిరి, ఆంధ్రజ్యోతి



ఇసుకాసురులపై డ్రోన్ కన్ను

కౌండిన్య నదిలో ఎక్స్‌కవేటర్ సీజ్

గంగవరం,నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇసుకాసురుల ఆగడాలకు చెక్ పెట్టేందుకు అధికారులు డ్రోన్ కెమరాలను రంగంలోకి దించారు. గంగవరం మండల పరిధిలోని కౌండిన్య నది కాలువలో ఇసుకను విచ్చలవిడిగా తరలించేస్తున్నారని సమాచారం అందడంతో చిత్తూరు నుంచీ గంగవరానికి డ్రోన్ కెమరాలను పంపించారు. వీటితో రెండు రోజుల నుంచి విస్తృత తనిఖీలు చేపట్టారు.కౌండిన్య నది కాలువలో ఇసుక తీస్తున్న ఎక్స్‌కవేటర్ డ్రోన్ కెమెరాకు పట్టుబడడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై తహసీల్దార్ శివకుమార్‌ను అడగ్గా నిబంధనల ప్రకారం కూలీలను పెట్టుకుని ఇసుకను ట్రాక్టర్లతో తరలించాలన్నారు. అలాకాకుండా ఎక్స్‌కవేటర్లు పెట్టి లారీల్లో ఇసుకను తరలించడానికి ప్రయత్నిస్తే వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు.





చిన్నశేషుడిపై పద్మావతి అమ్మవారు







అంగరంగ వైభవం అమ్మవారి బ్రహ్మోత్సవం

సకల దేవతలు అతిథులుగా రాగా, అఖిల జనకోటి ఆనందపరవశం కాగా ఎగిరింది ధ్వజపటం. ఎగసింది జయ జయధ్వానం. బ్రహ్మాండ నాయకుడి ప్రియదేవేరి పద్మావతిదేవి కార్తీక బ్రహ్మోత్సవాలు తిరుచానూరులో వైభవంగా మొదలయ్యాయి. టీటీడీ కళాబృందాల సాంస్కృతిక ప్రదర్శనలు భక్తకోటికి ఆకట్టుకున్నాయి. ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన ఫల, పుష్ప ప్రదర్శన యాత్రికుల మనసు దోచుకుంది.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు గురువారం ఉదయం ధ్వజారోహణంతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటూ జరిగే ఉత్సవాలు విజయవంతమయ్యేందుకు ధ్వజస్తంభం ఎదుట అర్చకులు పూజలు చేసి సకల దేవతామూర్తులను ఉత్సవాలకు ఆహ్వానించి దిగ్బంధనం చేశారు. ఉదయం 6.30 గంటలకు చక్రాత్తాళ్వార్ ముందు సాగగా వెనుకనే అమ్మవారికి అభిముఖంగా గజ చిత్రపటాన్ని తిరువీధుల్లో ఊరేగిస్తూ ఆలయానికి తీసుకొచ్చారు. యాగశాల నుంచి మొలకెత్తిన నవధాన్యాలను ధ్వజస్తంభం ముందు ఉంచి పూజలు చేశారు. అనంతరం ధ్వజస్తంభంపై ఉన్న గజప్రతిమకు సుగంధ పరిమళ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ప్రారంభసూచికగా గురువారం ఉదయం 9.30 గంటలకు ధ్వజారోహణం చేశారు. అదే సమయంలో అమ్మవారి మూలమూర్తికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. కంకణభట్టారు శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆయా కార్యక్రమాల్లో జీయర్‌స్వాములు, టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుబ్బరాయుడు, సుభాస్కరనాయుడు పాల్గొన్నారు.

కానుకగా గొడుగులు

చెన్నైకి చెందిన వీర్ వసంత్‌కుమార్ గురువారం ఆరు గొడుగులను అమ్మవారి ఆలయానికి కానుకగా అందించారు. టీటీడీ ఈవో శ్యామలరావుకి భక్తులు ఆలయం వద్ద అందజేశారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 8 గంటలకు పెద్దశేష వాహనం
- మధ్యాహ్నం 12.30 గంటలకు స్నపన తిరుమంజనం
- సాయంత్రం 5.30 గంటలకు ఊంజల్ సేవ
- రాత్రి 7 గంటలకు హంసవాహనం

ఫల పుష్ప సోయగం

తిరుచానూరులోని అమ్మవారి శుక్రవారపు తోటలో టీటీడీ ఉద్యానశాఖ ఏర్పాటు చేసిన ఫలపుష్ప ప్రదర్శన భక్తులకు కనువిందు చేస్తోంది. ఈ ప్రదర్శనను టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం కలిసి ప్రారంభించారు. పురాణ గాథలకు సంబంధించి ఏర్పాటు చేసిన వివిధ ఘట్టాల ప్రదర్శనలు విశేషంగా నిలుస్తున్నాయి. వివిధ పుష్పాలు, కూరగాయలతో ఏర్పాటు చేసిన జంతువులు, పక్షుల ఆకృతులు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. ఉద్యానవనశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు నేతృత్వంలో ఫల, పుష్ప ప్రదర్శనశాల అద్భుతంగా తీర్చిదిద్దారు. మైసూరుకు చెందిన గౌరి గత 9 సంవత్సరాలుగా సైకత శిల్పాన్ని తయారు చేస్తున్నారు. ఈ ఏడాది పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి సైకత శిల్పాన్ని రూపొందించారు. అదే విధంగా ఎస్వీ ఆయుర్వేద కళాశాల ఆధ్వర్యంలో ఎక్స్‌పోఆయు, ఎస్వీ ఆయుర్వేద ఫార్మసీ ఆధ్వర్యంలో వనమూలికా ప్రదర్శన, ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఎస్వీ సంప్రదాయ ఆలయ శిల్ప శిక్షణ సంస్థ ఏర్పాటు చేసిన శిల్పకళ ప్రదర్శనశాల భక్తులను ఆకట్టుకుంది.



పట్టువస్త్రాల సమర్పణ



రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గురువారం సాయంత్రం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయం వద్ద ఆయనకు టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, సీవీఎస్వో శ్రీధర్, అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనాంతరం ప్రసాదాలు అందజేశారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్టు మీడియా సమావేశంలో మంత్రి చెప్పారు. సీఎం చంద్రబాబు ఆలోచనల మేరకు అన్ని దేవాలయాల్లో మెరుగైన మార్పులు తీసుకొచ్చేలా చర్యలు చేపట్టామన్నారు.

భక్తులకు సకల సౌకర్యాలు

టీటీడీ ఈవో శ్యామలరావు

అమ్మవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు ఏర్పాట్లు చేశామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. గురువారం తిరుచానూరులో ధ్వజారోహణం కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తరహాలో అమ్మవారి బ్రహ్మోత్సవాలను కూడా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు మూలమూర్తితోపాటూ, వాహన సేవలను సంతృప్తిగా తిలకించేదుకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు.

తిరుచానూరులో తిరుమల లడ్డూలు

అమ్మవారి బ్రహ్మోత్సవాలు తిలకించేందుకు వచ్చే భక్తులకు తిరుచానూరులోని ఆలయ ప్రాంగణంలోని లడ్డూ కౌంటర్‌లో తిరుమల లడ్డూలు కూడా విక్రయిస్తున్నారు. దర్శనానంతరం ఆలయం లోపల ఉన్న కౌంటర్లో లడ్డూ టికెట్టు ఇస్తారు. వాటితో బయటున్న కౌంటర్లో శ్రీవారి లడ్డూలు కొనుగోలు చేసుకోవచ్చు. రోజూ పదివేల తిరుమల లడ్డూలు తిరుచానూరులో అందుబాటులో ఉంచుతామని ఆలయ డిప్యూటీ ఈవో గోవింద రాజన్ తెలిపారు.



కత్తితో బెదిరించి దోపిడీయత్నం

మన్నారుపోలూరులో పట్టపగలే ఘటన ● అడ్డొచ్చిన మహిళను ఆటోలో వేసుకెళ్లేందుకు ప్రయత్నించిన దుండగులు

సూళ్లూరుపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అడ్రస్ కావాలంటూ అడిగారు. ఆపై కత్తితో బెదిరించి ఇంట్లో దోపిడీకి యత్నించారు. ఈ ఘటన సూళ్లూరుపేట మండలం మన్నారుపోలూరులో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన ప్రకారం.. మన్నారుపోలూరు చేనేత కాలనీలో నివాసం ఉంటున్న తాపీ కూలీ వూడి మునస్వామి గురువారం పనికి వెళ్లారు. ఇంట్లో ఆయన భార్య దేవి, కుమారుడు చందు ఉన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ముగ్గురు వ్యక్తులు వీరి ఇంటి పక్కనే రోడ్డులో ఆటో నిలిపారు. అందులో ఒకడు వీరి ఇంటికొచ్చి ఏదో అడ్రసు కావాలంటూ తమిళంలో అడిగాడు. ప్రహరీ అవతల నుంచి అడ్రసు చెబుతున్న దేవి.. బయట మరో ఇద్దరు ఉండటం.. ఇతడు మద్యం తాగి ఉన్నాడని గమనించారు. అదే సమయంలో ఇంట్లోనే ఉన్న కుమారుడు చందు బయటకు వచ్చి ఇక్కడ అటువంటి అడ్రసు లేదంటూ చెప్పారు. ఆ వెంటనే దుండగులు ఈ అడ్రసు మాకు తెలియదు చెప్పండంటూ బలవంతంగా ఆ ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసి చందు మెడపై కత్తి పెట్టారు. అరిస్తే చంపేస్తామంటూ బెదిరించారు. పక్కనే ఉన్న దేవి కేకలు వేయడంతో పక్క ఇంట్లో ఉన్న వల్లూరు వెంకటమ్మ అరుస్తూ వెళ్లి తలుపులు కొట్టింది. దీంతో చుట్టుపక్కల వాళ్లు వచ్చారన్న భయంతో దుండగులు తలుపులు తీసి పారిపోయేందుకు ప్రయత్నించారు. అయితే, చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో వెంకటమ్మను బలవతంగా ఆటో వద్దకు లాక్కెళ్లి బెదిరించారు. కాసేపు వారితో పెనుగులాడిన ఆమె తప్పించుకొని పరుగెడుతూ ఇంట్లోకి వెళ్లారు. అప్పుడే భోజనానికి వస్తున్న మునస్వామి ఏమి జరిగిదంటూ అరవడంతో దుండగులు ఆటోలో సూళ్లూరుపేట వైపు వెళ్లారు. వెంటనే బాధితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి వివరాలు తీసుకొన్నారు. ఆంధ్ర, తమిళనాడుకు సరిహద్దులో ఉండటంతో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి.



వివరాలు వెల్లడిస్తున్న బాధితులు దేవి, చందు

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 7 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. ఇక, మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించింది. రూ.3.75 కోట్లు ఆదాయం లభించినట్టు గురువారం ఉదయం ప్రకటించింది. బుధవారం 67,626 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 22,231 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

స్విమ్స్‌లో ఎమ్మెస్సీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి(వైద్యం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ బయో టెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వనజాక్షి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ 1, బయో ఇన్ఫర్మేటిక్స్ 4 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఏపీ పీజీసెట్‌కు సంబంధం లేకుండా వీటిని భర్తీ చేస్తామని, అభ్యర్థులు ఈనెల 29న స్విమ్స్‌లో నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

రేపు స్వర్ణముఖి నదీ హారతులు

- రాహుకేతు పూజలు మినహా ఆర్జిత సేవల రద్దు

శ్రీకాళహస్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణముఖిలో నదీహారతులు సమర్పించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈనెల 30న శనివారం సాయంత్రం 7గంటలకు స్వర్ణముఖి నదీ తల్లికి కలశపూజలు, ధూప, దీప, నైవేద్యాలు, మహాదీపారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు వీక్షించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. కాగా నదీహారతులను పురస్కరించుకుని ఆలయంలో రాహుకేతు పూజలు మినహా అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు ఈవో తెలిపారు.

ముక్కంటి ఆలయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సస్పెన్షన్

శ్రీకాళహస్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి చంద్రయ్యను సస్పెండ్ చేస్తూ ఈవో బాపిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ముక్కంటి ఆలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న జ్ఞానప్రసూనాంబిక నర్సింగ్ కళాశాల వ్యాన్ క్లీనర్‌గా చంద్రయ్య విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే రెండు రోజుల క్రితం ముక్కంటి ఆలయంలో సంచరిస్తూ అడ్డదారిలో భక్తులను దర్శనానికి తీసుకెళ్తుండగా కొందరు అభ్యంతరం చెప్పడమే కాకుండా ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ఈవో భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా అడ్డదారిలో దర్శనానికి తీసుకెళ్లినట్టు గుర్తించారు. అలాగే గతంలో హుండీ లెక్కింపు సందర్భంగా చోరీకి పాల్పడి చంద్రయ్య జైలుకు వెళ్లివచ్చినట్లుగా గుర్తించారు. ఈ మేరకు అడ్డదారిలో భక్తులను దర్శనానికి అనుమతించడంపై సస్పెండ్ చేశారు.

ప్రియుడ్ని కిడ్నాప్ చేయించింది!

- తిరుపతిలో కలకలం
- గంట వ్యవధిలోనే పట్టుకున్న పోలీసులు

తిరుపతి, (నేరవిభాగం), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తనను సరిగా చూడటం లేదని ప్రియురాలే ప్రియుడ్ని కిడ్నాప్ చేయించింది. ఈ ఘటన గురువారం తిరుపతిలో కలకలం రేపింది. గంట వ్యవధిలోనే పోలీసులు నిందితులు, బాధితుడిని పట్టుకోగలిగారు. తిరుపతి ఈస్ట్ సీఐ రామకృష్ణ తెలిపిన ప్రకారం.. చిత్తూరు జిల్లా పెనుమూరుకు చెందిన నాని తిరుపతి పెద్దకాపులేఅవుట్‌లో ఒక లాడ్జిని లీజుకు తీసుకున్నారు. ఇతడికి వివాహం కాలేదు. ఈ క్రమంలో మదనపల్లెకు చెందిన భాను.. భర్త చనిపోవడంతో తిరుపతికి వచ్చి చిన్నచిన్న పనులు చేసుకుంటున్నారు. ఈమె ఏడాద కిందట భానుకు పరిచయమైంది. వీరిద్దరూ కలిసి పెద్దకాపు లేఅవుట్‌లో ఉంటున్నారు. మూడు నెలలుగా తనను సరిగా పట్టించుకోక పోవడంతో ఆగ్రహించిన భాను.. మదనపల్లె నుంచి నలుగురు రౌడీలను రప్పించింది. లాడ్జిలో ఉన్న నానిని కిడ్నాప్ చేయించి మదనపల్లెకు తీసుకెళుతున్నారు. వాహనంలో అతడిని చిత్రహింసలకు గురిచేసినట్లు సమాచారం. కిడ్నాప్ సమాచారం తెలిసిన వెంటనే డీఎస్పీ వెంకటనారాయణ, సీఐ రామకృష్ణ రక్షక్ బృందాలను ఎస్పీ సుబ్బరాయుడు అప్రమత్తం చేశారు. నాని మొబైల్ నెంబరు ఆధారంగా వాహనాన్ని గుర్తించారు. వాయల్పాడు వద్ద ప్రత్యేక బృందాలు వాహనం ఆపి కిడ్నాపర్లతో పాటు నానిని అదుపులోకి తీసుకుని తిరుపతికి తీసుకొస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో కిడ్నాపర్లను, బాధితుడ్ని విచారించి జరిగిన ఘటనపై దర్యాప్తు చేయనున్నారు.

బీసీల సంక్షేమానికి రూ.39వేల కోట్లు

- ఈ ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్న మంత్రి సవిత

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు28 (ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమానికి రూ.39వేల కోట్లను కేటాయించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందని మంత్రి ఎస్.సవిత అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గురువారం తిరుచానూరులోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు విద్యావంతులు కావాలనే ఉద్దేశంతో ఆ రోజుల్లోనే మహాత్మా జ్యోతిబాపూలే పోరాడారని ఆమె గుర్తు చేశారు. 70 నుంచి 80 శాతం పనులు పూర్తయిన బీసీ వసతి గృహాలు, రెసిడెన్షియల్ హాస్టళ్లను త్వరలో పూర్తి చేయనున్నామని తెలిపారు. బీసీలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణను ప్రారంభించామని, త్వరలో ఆన్‌లైన్ ద్వారా కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ, సాధికార అధికారి చంద్రశేఖర్, బీసీ సంక్షేమశాఖ అధికారులు, ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మంత్రి సవిత

మంచి రోజు చూసుకుని రండి

- కళంకిత కార్పొరేటర్లను పక్కన పెట్టండి
- టీడీఆర్ స్కాం, భూ కబ్జాలు, కూటమి నేతలపై దౌర్జన్యాలు చేసిన నేతలొద్దు
- ఇన్‌చార్జి మంత్రి అనగాని సూచన

తిరుపతి, నవంబరు28(ఆంధ్రజ్యోతి): కళంకిత కార్పొరేటర్లను పక్కన పెట్టి, తక్కినవారిని పార్టీలో చేర్చుకునేందుకు అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపినట్టు తెలిసింది. మంచి రోజు చూసుకుని పార్టీలో చేరేందుకు రావాలని సూచించినట్లు సమాచారం. మున్సిపల్ ఎన్నికల చట్ట సవరణ నేపథ్యంలో వైసీపీ కార్పొరేటర్లు కూటమి పార్టీలో చేరేందుకు బీసీ నేత అన్నా రామచంద్రయ్య, వైసీపీ సీనియర్ నేత దొడ్డారెడ్డి సిద్దారెడ్డి నేతృత్వంలో ఇటీవల 10 మందికి పైగా కార్పొరేటర్లు విజయవాడకు వెళ్లి ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసిన విషయం తెలిసిందే. తిరుపతికి వచ్చినప్పుడు పార్టీలోకి చేరేందుకు సన్నాహాలు చేసుకోమని మంత్రి చెప్పిన నేపథ్యంలో పలువురు కార్పొరేటర్లు ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి దిశానిర్దేశం చేసినట్టు సమాచారం. టీడీఆర్ బాండ్ల కుంభకోణం, భూకబ్జాలు, కూటమి నేతలపై దౌర్జన్యాలు చేసిన వైసీపీ నేతలను పార్టీలోకి తీసుకోవద్దని చెప్పినట్లు తెలియవచ్చింది. పార్టీ అధిష్ఠానం ఇప్పటికే పలువురు కార్పొరేటర్ల గురించి ఆరాతీసిందని, వారిపై సానుకూలమైన నివేదిక వచ్చిందన్న చర్చ జరిగినట్టు సమాచారం. అలాంటివాళ్లను పార్టీలోకి తీసుకునే ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పినట్టు తెలిసింది.







రామ్మూర్తి నాయుడి కర్మక్రియల్లో పాల్గొనేందుకు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి - డిప్యూటీ స్పీకరు రఘురామకృష్ణరాజు - మాజీ ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ - నందమూరి మోహనకృష్ణ, రూప, నందమూరి సుహాసిని

నారావారిపల్లెలో ప్రముఖుల సందడి






సీఎం చంద్రబాబుతో టీటీడీ అదనపు ఈవో వెంకన్న చౌదరి - నారా చిన్నబ్బనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చంద్రబాబు - సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.1,00116 చెక్కు అందజేస్తున్న రైతులు - మంత్రి లోకేశ్‌కు వినతుల అందజేత

నిధుల్లేక రూపుమారిన నర్సరీలు

రైతులకు అవసరమైన మొక్కల పెంపకంతో పాటు సామాజిక పచ్చదనానికి ఉపయోగపడిన సదుం నర్సరీ ఇలా పిచ్చి మొక్కలతో దర్శనమి స్తోంది. రైతులకు ఉపయోగపడే పండ్ల మొక్క లతో పాటు అడవుల్లో రోడ్లకు ఇరువైపులా పెంచేందుకు ఉపయోగపడే ఉసిరి, బాదం, అల్ల నేరేడు, వేప, మద్ది, కానుగ మొక్కలను వేల సంఖ్యలో పెంచి నామమాత్రపు ధరలతో రైతులకు నర్సరీ తరపున విరివిగా అందజేసేవారు. అలాగే ఎంచుకున్న ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా మొక్కలను పెంచి సంరక్షణ బాధ్యతలను స్థానిక ప్రజాప్రతినిధులకు అప్ప గించేవారు. అయితే 2022 నుంచి మొక్కలు పెంచక పోవడంతో నర్సరీ పిచ్చి మొక్కలతో దర్శనం ఇస్తోంది. పట్టించుకునే సిబ్బంది లేక పోవడంతో నర్సరీ భూమి కబ్జాకు గురవుతోందన్న ఆరోపణలున్నాయి. పలమనేరు, సోమల మండలాల పరిధిలోని బట్టందొడ్డి, సింగిరి గుట్ట నర్సరీలు కూడా ఇదే బాటలో నడుస్తున్నా యి.ఈ విషయమై పుంగనూరు రేంజ్ ఎఫ్ఆర్‌వో శ్రీరా ములును అడగ్గా నిధులు లేక మొక్కల పెంపకం ఆగిపోయిందన్నారు. సదుం నర్సరీ పునరుద్ధరణకు స్థానిక తహసీల్దారుకు లెటర్ కూడా ఇచ్చామని, త్వరలోనే నర్సరీని పునరుద్ధరిస్తామన్నారు.

- సదుం, ఆంధ్రజ్యోతి


పిచ్చి మొక్కలతో నిండిన సదుం నర్సరీ

పాత భవనాలను పరిరక్షించరూ..!

కుగ్రామమైన సదుంలో వారణాశి కుటుంబం బ్రిటీష హయాంలోనే ప్రజలకవసరమైన భవనాలను నిర్మించింది. గ్రామ నడిబొడ్డున సాగే గార్గేయ నదిపై వంతెన నిర్మించడంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాల, పశువైద్యశాల, పోలీసు స్టేషన్, పంచాయతీ కార్యాలయం సొంత నిధులతో నిర్మించారు. అయితే వీటిలో చాలా కట్టడాలు కాలగర్భంలో కలసిపోయాయి.నివర్ తుపాను సందర్భంగా వచ్చిన వరదలతో గార్గేయ నదిపై బ్రిటీష హయాంలో నిర్మించిన వంతెన కూడా కొట్టుకుపోయింది. ప్రస్తుతం జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలు మాత్రమే నాటి గుర్తులుగా మిగిలి ఉన్నాయి.వీటికోసం కూడా కొత్త భవనాలు నిర్మిస్తుండడంతో పాత భవనాలు దగ్గర్లోనే కనుమరుగు కానున్నాయి. అయితే దశాబ్దాలుగా ఎంద రికో విద్యాబుద్ధులు నేర్పిన ఉన్నత పాఠశాల, 1932 నుంచి వైద్యసేవలందిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలకు శాశ్వత మరమ్మతులు చేయాలని స్థాని కులు కోరుతున్నారు. బ్రిటీష హయాం నాటి కట్టడాలను భవిష్యత్తరాలకు గుర్తుగా భద్రపరచాలని ఆకాంక్షిస్తున్నారు.


జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- సదుం, ఆంధ్రజ్యోతి

జాతీయ ఖోఖో పోటీలకు పాముగానిపల్లె విద్యార్థిని


లక్ష్మిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వి.కోట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం పాముగానిపల్లె ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న లక్ష్మి రాష్ట్ర స్థాయి ఖోఖో జట్టుకు ఎంపికైనట్లు హెచ్ఎం రవీంద్రనాథరెడ్డి, పీఈటీ సురేష్ తెలిపారు. ఈ నెల 23 నుంచి 25 వరకు కారంపూడిలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ -14 ఖోఖో బాలికల విభాగంలో చిత్తూరు జిల్లా ప్రథమ స్థానం కైవసం చేసు కుంది. ఈ జట్టులో ఉత్తమ ప్రతిభ కనబరచిన లక్ష్మీ రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించింది. త్వరలో మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం తరపున ప్రాతినిథ్యం వహించనుంది. లక్ష్మిని, పీఈటీ సురేష్‌ను సహ చర ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు


హత్య కేసులో నిందితుడిని అరెస్టు చూపుతున్న డీఎస్పీ, సీఐ

వి.కోట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం కొంగాటం పంచాయతీ చింతల ఎల్లా గరానికి చెందిన నవాజ్ బాష హత్య కేసులో నింది తుడు సర్దార్(47)ను పోలీ సులు అరెస్టు చేశారు. పల మనేరు డీఎస్పీ ప్రభాకర్, సీఐ సోమశేఖర్ హత్యకేసు వివరాలను గురువారం వెల్లడించారు. నవాజ్, సర్దార్ స్నేహితులు. నవా జ్‌కు 2021లో డబ్బు అవ సరం ఏర్పడింది. సర్దార్ జామీనుగా ఉండి రూ.50వేల వంతున రెండు దఫా లుగా వేరేవారి వద్ద రూ.లక్ష అప్పు తీసి ఇచ్చాడు. అప్పు ఇచ్చిన వారు అడు గుతున్నా నవాజ్ వాయిదాలు వేస్తూ వచ్చాడు. దీంతో వారు సర్దార్‌పై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో నవాజ్‌ను అంతమొందిస్తే అప్పు ఇచ్చిన వారు అడగ రని సర్దార్ భావించాడు. ఈనెల 21న ఇంట్లో నిద్రిస్తున్న నవాజ్‌ను తీసుకె ళ్లాడు. పాలారు నది ఒడ్డున ఉన్న మునస్వామిరెడ్డి మామిడి తోటలో ఇద్దరూ మద్యం తాగారు. ఆ సమయంలో కొయ్యతో కొట్టి అతడిని చంపేశాడు. మృత దేహానికి డ్రిప్ పైపులు చుట్టి పాలారు నదిలోని జంబులో పడేసి వచ్చేశాడు. అయితే నవాజ్ ఇంటికి రాకపోవడంతో అతడి కుటుంబ సభ్యులు రెండు రోజులు వెతికినా ప్రయోజనం లేకపోయింది. అనుమానంతో సర్దార్‌ను ప్రశ్నించడంతో అతడు పరారయ్యాడు. ఈ క్రమంలో నిందితుడిని అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన కొయ్యను స్వాధీనం చేసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు సూక్ష్మ కవితలు పుస్తకావిష్కరణ సభ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ తెలుగు విశ్రాంతాచార్యులు ఎస్వీడీ చంద్రశేఖర్ రాసిన సూక్ష్మ కవితలు పుస్తకావి ష్కరణ సభ శుక్రవారం ఎస్వీయూలో జరగనుంది. ఉదయం 10 గంటలకు తెలుగు విభాగంలోని ఆచార్య జీఎన్ రెడ్డి సెమినార్ హాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ తరం కవితా వేదిక - తెలుగు విభాగం సంయుక్తంగా ఈ కార్య క్రమాన్ని చేపట్టనున్నాయి. తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ అధ్యక్ష తన జరిగే ఈ సభలో ఆచార్య ఎస్వీడీ చంద్రశేఖర్, విశ్రాంతాచార్యులు మేడిపల్లి రవికుమార్, తోట వెంకటేశ్వర్లు, విశ్రాంతాచార్యులు పేట శ్రీనివాసులురెడ్డి పాల్గొం టారని ఎస్వీయూ తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ తెలిపారు.

16న పడమటిగాలి నాటక ప్రదర్శన

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మహతి కళా క్షేత్రంలో డిసెంబరు 16న పడమటి గాలి నాటకం ప్రదర్శిస్తున్నట్లు నాటక రచ యిత పాటిబండ్ల ఆనందరావు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ అమెరికా వంటి దేశాలలో ఈ నాటకం ప్రజల మన్ననలు పొందిం దని వివరించారు.రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బలరామయ్య ఈ నాటకంలో ప్రధాన ప్రాత పోషించారని చెప్పారు. ఈ నాటకాన్ని ఉచితంగా ప్రదర్శిస్తున్నామని, నగర వాసులు తిలకించి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షుడు డాక్టర్ తమటం రామచంద్రారెడ్డి, ప్రధాన కార్య దర్శి ఆకుల మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, ధర్మయ్య పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామాలుగా అభివృద్ధి చేయండి

గ్రామస్తులు, అధికారులతో సీఎం సమీక్ష

చంద్రగిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలోని ఎ.రం గంపేట నుంచి మూలపల్లె వరకు ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి తన స్వగృహంలో అధికారులు, నారావారిపల్లె పరిసర గ్రామాల వారితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటికి సోలార్ ఏర్పాటు చేయాలన్నారు. ఎ.రంగంపేటలోని ఉన్నత పాఠశాలను మరింత అభివృద్ధి చేయాలన్నారు. నారావారిపల్లెలోని ప్రభుత్వ భవనాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా ఏర్పాటు చేసి, ఉపాధి కల్పనకు శ్రీసిటీకి అనుసంధానం చేయాలన్నారు. అదేవిధంగా గ్రామస్తులు మూలపల్లెలో హంద్రీనీవా నీటి ప్రాజెక్టు గత ప్రభుత్వంలో నిలిచిపోయిందని, ఆ ప్రాజెక్టు పూర్తయితే చెరువుల అనుసంధానం చేయడం వలన చంద్రగిరి మండలం సస్యశ్యామలం అవుతుందని గ్రామస్తులు తెలిపారు. ప్రధానంగా రైతులు పంటలు పండించలేకపోతున్నామని, శేషాచలం అడవుల నుంచి కోతుల బెడద అధికంగా ఉందని తెలపడంతో.. తగు చర్యలు చేపట్టాలని అధికారు లను సీఎం ఆదేశించారు. ప్రతి రైతుకు ప్రతి నెల రూ.15 వేల రూపాయల ఆదాయం వచ్చేలా రూపకల్పన చేయాలని గ్రామస్తులు కోరారు. దీంతో వ్యవసాయ ఆధారితపంటలు లాభదాయకంగా వచ్చేలా అధికారులు ప్రణా ళికలు సిద్ధంచేయాలన్నారు. ఆయా గ్రామస్తులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్, డీపీవో సుశీలాదేవి, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, ఎమ్మెల్యే పులివర్తి నాని, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, గ్రామస్తులు గిరినాయుడు, వెంక టపతినాయుడు, నిరంజన్‌నాయుడు, పాశం చంద్రకుమార్‌నాయుడు, నారా సుబ్రమణ్యంనాయుడు, రాకేష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న సీఎండీ కె.సంతోషరావు, బీసీ నాయకులు

అసమానతల నిర్మూలనలో పూలే కృషి మరువలేనిది

సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అస మానతలకు వ్యతిరేకంగా మహాత్మ జ్యోతీరావుపూలే చేసిన కృషి ఎనలేనిదని సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావు అన్నారు. తిరుపతి సదరన్ డిస్కం కార్పొరేట్ కార్యాల యంలో గురువారం పూలే వర్ధంతి నిర్వహించారు. కార్యాల యంలో పూలే చిత్రపటం పెట్టి పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో వందేళ్ల క్రితం సాంఘిక దుశ్చర్యలను రూపుమాపడానికి ఆయన ఎనలేని కృషి చేశా రన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ వై.లక్ష్మీనరసయ్య, సీజీ ఎంలు కేఆర్ఎస్ ధర్మజ్ఞాని, జానకిరామ్, చీఫ్ విజిలెన్స్ ఆఫీ సర్ జనార్దన్‌నాయుడు, జీఎంలు ఎం.కృష్ణారెడ్డి, వెంకట రాజు, ప్రసాద్, పి.మురళి, శోభా వాలంటీనా, సురేంద్రరావు, బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు ఎల్.చలపతి, సి.వి. వేణు, జగదీష్ పాల్గొన్నారు. ఎస్ఈ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈఈ టెక్నికల్ వాసవీలత, ఎస్ఏవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లపై సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

హిందూ ఉపాధ్యాయ సమితి అధ్యక్షుడు మహేష్

తిరుపతి(గాంధీరోడ్డు), నవంబరు28(ఆంధ్రజ్యోతి): కేవలం రిజర్వేషన్ల ప్రయోజనాలు పొందడానికి తమను తాము హిందువులుగా పేర్కొనడాన్ని అనుమతించబోమన్న సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తీర్పు ద్వారా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు హిందు వులకు మాత్రమేనని స్పష్టంగా తెలిపారని పేర్కొన్నారు. రంజాన్ మాసంలో ముస్లిం ఉద్యోగులకు శుక్రవారం రోజున గంట అనుమతి ఇస్తున్నారని, అదే తరహాలో కార్తీక, మార్గశిర మాసాల్లో హిందూ ఉద్యోగులకు గంట ప్రత్యేక అను మతి కోసం ఐదేళ్లుగా కోరుతున్నామని పేర్కొన్నారు. ఈ దిశగా పాలకులు స్పందించాలని కోరారు.

ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

కల్లూరు, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): పులి చెర్ల మండలం కల్లూరు నాలుగురోడ్ల కూడలి సమీపంలో గురువారం ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న సంఘటనలో పెను ప్రమాదం తప్పింది. వివరాలు... ప్రొద్దు టూరు నుంచి చిత్తూరుకు ప్రయాణి కులతో వెళుతున్న ఆర్టీసీ బస్సు కల్లూరులో ప్రయా ణికులను దింపింది. మరికొందరిని ఎక్కిం చుకు నేందుకు ఆగింది. ఈ సమయంలో పీలేరు వైపు నుంచి చిత్తూరుకు వెళుతున్న లారీ ఆగి ఉన్న బస్సును వెనుక వైపు నుంచి ఢీకొని ఓవర్‌టేక్ చేస్తూ రాసుకుంటూ ముందుకు వెళ్లింది. అదృష్టవ శాత్తూ ఆ సమయంలో బస్సులోని ప్రయాణికు లెవరూ బయట చేతులు, తలలు బయటపెట్టి ఉండక పోవడంతో ప్రమాదం తప్పింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.



మర్చిపోయిన బ్యాగు అప్పగింత

తిరుమల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అతిథిగృహం వద్ద భక్తుడు మర్చిపోయిన బ్యాగును తిరిగి అప్పగించారు. చెన్నైకు చెందిన సెల్వరాజు శ్రీవారి దర్శనార్థం గురు వారం తిరుమలకు వచ్చారు. దర్శనానికి వెళ్లే ముందు గోవిందసాయి కౌంటర్ వద్ద టీ తాగారు. ఈ క్రమంలో బ్యాగును అక్కడే మర్చిపోయి వెళ్లిపోయారు. విధి నిర్వహ ణలో ఉన్న జూనియర్ అసిస్టెంట్ రెడ్డి భాస్కర్ దాన్ని గుర్తించి పద్మావతి విచారణ కార్యాలయ సూపరింటెండెంట్ భాస్కర్‌కు అందజేశారు. తర్వాత బ్యాగు పోయిం దంటూ వచ్చిన భక్తుడు సెల్వరాజు నుంచి వివ రాలు సేకరించిన తర్వాత బ్యాగును తిరిగి అప్ప గించారు.


భక్తుడికి బ్యాగు అందజేస్తున్న రిసెప్షన్ అధికారులు

ఆర్టీఏ కార్యాలయానికి క్యూ

- తనిఖీలతో లైసెన్స్‌ల కోసం ఎగబడుతున్న వాహనదారులు

తిరుపతి (రవాణా), నవంబరు 28 (ఆంధ్రజోతి): రవాణా శాఖ (ఆర్టీఏ) అధికారులు, పోలీసులు ఇటీవల వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. లైసెన్స్ లేని వారికి భారీగా జరిమానా విధిస్తున్నారు. కొందరిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలో లైసెన్స్‌ల కోసం వాహనదారులు ఆర్టీఏ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. లైసెన్స్ పొందాలంటే మొదటగా ఆన్‌లైన్‌లో ఎల్ఎల్ఆర్ స్లాట్ బుక్ చేసుకోవాలి. స్లాట్‌లో వచ్చిన తేదీన ఆర్టీఏ కార్యాలయంలో కంప్యూటర్ టెస్టుకు హాజ రుకావాలి. అందులో పాస్ అయితేనే డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్‌కు అర్హత సాధిస్తారు. ఎల్ఎల్ఆర్ టెస్ట్ పాసైన నెల రోజుల తర్వాత డీఎల్ స్లాట్ బుక్ చేసుకునే వెలుసుబాటు ఉంటుంది. ఎల్ఎ ల్ఆర్ ధ్రువపత్రం పొందిన తేదీ నుంచి 5 నెలల వరకు మాత్రమే డీఎల్ స్లాట్ బుక్ చేసుకునేందుకు వెలుసు బాటు ఉంటుంది. అదే తరహాలో డీఎల్ పరీక్షకు హాజరైన అభ్య ర్థులు ట్రాక్‌లో నియమ నిబంధన లకు అనుగుణంగా డ్రైవింగ్ చేయ డంతో లైసెన్సుకు అర్హత సాధి స్తారు. లైసెన్స్‌లు పొందేందుకు రవాణా శాఖలో రోజుకు ఎల్ఎల్ ఆర్ స్లాట్లు 60 మాత్రమే (ఒక్కో కార్యాలయంలో) అందుబాటులో ఉంటాయి. దీంతో ఎల్ఎల్ఆర్ స్లాట్‌కు డిమాండ్ పెరిగింది.


తిరుపతి ఆర్టీఏ కార్యాలయంలో ఎల్ఎల్ఆర్ పరీక్ష కోసం వేచి ఉన్న అభ్యర్థులు (ఫైల్ ఫొటో)

ఆకట్టుకున్న జీవ వైవిధ్య ఫొటో ప్రదర్శన

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం ఆధ్వర్యంలో తిరుపతి పాస్‌పోర్టు సేవా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన జీవ వైవిధ్య ఫొటో ప్రదర్శన ఆకట్టుకుంది. రీజనల్ పాస్‌పోర్టు అధి కారి శివహర్ష హాజరై ప్రజలకు పాస్‌పోర్టు సేవలు మరింత మెరుగ్గా అందించడంతో పాటు జీవ వైవిధ్యంపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఫారెస్టు కన్జర్వేటర్ సెల్వం మాట్లా డుతూ నగరంలో శేషాచలం అడవులు, చంద్రగిరి కోట, మాల్వాడి గుండం జలపాతాలు, జంతు ప్రదర్శన శాలలతో సహా ఎన్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, వాటిని ప్రతిబిం బించేలా ఫొటో ఎగ్జిబిషన్ ఉందని కొనియాడారు.

ఎస్వీయూ పీజీ పరీక్షల వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): డిసెంబరు 2వ తేదీ నుంచి నిర్వహించాల్సిన ఎస్వీయూ పీజీ మూడవ సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడ్డాయి. డిసెంబరు 7వ తేదీ నుంచి ఈ పరీక్షలు నిర్వహిం చాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను అధికారులు గురువారం జారీ చేశారు.

టీచర్లపై పని ఒత్తిడి తగదు

తిరుపతి(విద్య), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టీచర్లపై పని ఒత్తిడి తగ్గించా లని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజీ, ప్రధాన కార్యదర్శి జి.వి.సత్యనారాయణ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వం టీచర్లపై పని ఒత్తిడి పెంచి, వేధిస్తోందన్నారు. రెసిడెన్షియల్ ట్రైనింగ్‌లను ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నా వినిపించుకో వడం లేదన్నారు. గతంలో ఓ టీచర్ మృతిచెందినా మళ్లీ సుదూర ప్రాంతాల్లోనే రెసిడెన్షియల్ ట్రైనింగ్‌లు ఏర్పాటు చేయడం సమంజసం కాదన్నారు. తాజాగా విజయనగరం జిల్లాలో మరో ఉపాధ్యాయుడిని కోల్పోవాల్సి వచ్చిందన్నారు. పని గంటలు పెంచడం, సెలవులను 10శాతానికి పరిమితం చేయడం, బయోమెట్రిక్ పేరుతో మెమోలు ఇచ్చి బెదిరించడం దారుణమన్నారు. ఉపాధ్యాయులు ప్రశాం తంగా బోధన చేసుకునే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.





నదీ హారతులకు ముమ్మర ఏర్పాట్లు



శ్రీకాళహస్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద ఈనెల 30న శనివారం రాత్రి జరగనున్న స్వర్ణముఖి నది హారతుల మహోత్సవానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ముక్కంటి ఆలయం పక్కనే స్వర్ణముఖి నదిలో గంగ హారతుల కోసం వారం రోజుల ముందు నుంచే అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. హారతులు సమర్పించే ప్రాంతాన్ని విశేషంగా విద్యుత్ అలంకరణలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. రెండు రోజుల ముందుగానే గురువారం రాత్రి నదీహారతుల సందడి నెలకొంది.

అవినీతిమయం.. పుత్తూరు పట్టణ ప్రణాళిక విభాగం

- ప్రతి నిర్మాణానికి ఓ రేటు
- సచివాలయం సిబ్బందికే ఆక్రమణల గుర్తింపు
- వసూళ్ల బాధ్యతలు

పుత్తూరు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణం వేగంగా విస్తరిస్తోంది. ఇంతే వేగంగా టౌన్ ప్లానింగ్ విభాగం అవినీ తిమయవుతోంది. అక్రమ నిర్మాణాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఒక్కో అక్రమ నిర్మాణానికి ఒక్కో రేటు లెక్కన వ సూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఏటా వందల సంఖ్య లో ఇళ్ల నిర్మాణాలను అనుమతులు లేకుండా యథేచ్ఛగా చేపడుతు న్నారు. నిబంధనల ప్రకారం చేపట్టిన ఇళ్ల యజమానులను కూడా ప్రణాళిక విభాగం సిబ్బంది వదలడం లేదు. ప్లాట్ విస్తీర్ణం, ఏ మేర కు నిబంధనలు ఉల్లంఘించారనే దానిపై అధికారులు అంచనా వేసి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇప్పుడున్న నిబంధనల మేరకు పుత్తూరులో జీ+2 మాత్రమే నిర్మించాల్సి ఉంది. పట్టణంలో దాదాపు వంద బహుళ అంతస్తుల భవనాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నా యి. దాదాపు 500 అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేసినట్లు ప ట్టణ ప్రణాళిక విభాగం అధికారి ఒకరు తెలిపారు. అంటే అక్రమ ని ర్మాణాలు ఏ స్థాయిలో జరిగాయో అవగతమవుతోంది. నిర్మాణాలకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన పేరుతో జా ప్యం చేస్తున్నారు. సిబ్బంది ఆశించిన డబ్బులు ఇస్తే త్వరగా అనుమ తులు ఇస్తున్నారనే విమర్శలున్నాయి. అక్రమ నిర్మాణాల నగదును టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఇవ్వడం వంటి వ్యవహారాలను 13 మంది సచివాలయం ప్రణాళిక సిబ్బంది ఎంతో బాధ్యతాయుతంగా నిర్వహి స్తున్నట్టు ఆరోపణలున్నాయి.



నిబంధనల ప్రకారమే నిర్మాణాలు

ఇప్పటి వరకు జరిగిన నిర్మాణాల జోలికి వెళ్లలేం. ఇకపై అనుమ తుల మేరకు నిర్మాణాలు చేపట్టేలా చర్యలు చేపడతాం. అక్రమ నిర్మా ణాలకు పాల్పడిన వారికి నోటీసులు జారీ చేస్తాం. ప్రస్తుతం భవన నిర్మాణ దరఖాస్తుల ఆమోదంలో జాప్యం నెలకొంటోంది. సర్వర్ ఆధు నీకరణ పనులు జరుగుతుండటంతో గత 15 రోజులుగా ఆన్‌లైన్ ప్ర క్రియ పనిచేయడం లేదు. నిర్మాణాలకు తాత్కాలిక అనుమతులు ఇ స్తున్నాం.

- నీరజాక్షి, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి

నేడు సీఎం తిరుగు ప్రయాణం

తిరుపతి (నేరవిభాగం), ఆంధ్రజ్యోతి: సీఎం చంద్రబాబు శుక్రవారం అమరావతికి తిరుగు ప్రయాణం కానున్నారు. ఉదయం 9.30 గంటలకు నారావారిపల్లెనుంచి బయలుదేరి 10 గంటలకు రేణిగుంట విమానాశ్ర యానికి చేరుకుంటారు. విమానంలో గన్నవరం విమానాశ్రయం చేరు కుని.. అక్కడ్నుంచి వెలగపూడి సచివాలయానికి వెళ్లనున్నారు. మంత్రి లోకేశ్ గురువారం రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు.

భారీ భద్రత: నారావారిపల్లెకు సీఎం చంద్రబాబు, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, నాయకులు రావడంతో గురువారం పోలీ సులు భారీ భద్రతా చర్యలు చేపట్టారు. ముఖ్యమంత్రి నివాసంలోకి అను మతి ఉన్నవారిని మాత్రమే మెటల్ డిటెక్టర్‌లతో తనిఖీలు చేసి అనుమ తించారు. చాలామంది నాయకులను సీఎం నివాసంలోకి పోలీసులు అనుమతించలేదు. దీనిపై కొందరు పోలీసులతో వాదనకు దిగారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో ప్రధాన ద్వారం వద్ద తిరుమల అద నపు ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ రవికుమార్, సీఐ అహమ్మద్, పోలీసులు బందోబస్తు చేపట్టాయి. భోజనశాల, వేదిక, సభా ప్రాంగణం, సీఎం ఇంటి వద్ద భారీ ఎత్తున పోలీసు బలగాలు మోహరించాయి. డాగ్ స్క్వాడ్లతో పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్ ఇతర అధికా రులు డీఐజీ షిమోషి, ఎస్పీ సుబ్బరాయుడు, అదనపు ఎస్పీలు, డీఎస్పీలు బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు. కాగా, గురువారం రాత్రి చంద్రబాబు నారావారిపల్లెలో బస చేయడంతో పోలీసులు సీఎం ఇంటి చుట్టూ భద్రత పెంచారు.

రామ్మూర్తి నాయుడికి నివాళులు



సీఎం చంద్రబాబు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడి కర్మక్రియలు గురువారం వారి స్వగ్రామమైన నారావారిపల్లెలో జరిగాయి. ఈ కార్యక్రమంలో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, పుంగనూరు ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలు

పుంగనూరు రూరల్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు- మదనపల్లె మార్గంలోని బోనేపల్లె క్రాస్ వద్ద గురువారం ఉదయం ప్రైవేటు పాఠశాల బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. మండలంలోని భీమగానిపల్లె పంచాయతీ బోనేపల్లెకు చెందిన భార్గవి తన పిల్లలను పాఠశాలలో వదలడానికి ద్విచక్ర వాహనంలో పుంగనూరుకు బయలు దేరింది. అదే గ్రామానికి చెందిన లీలావతమ్మ పుంగనూరుకు వస్తానని చెప్పడంతో ఆమెను కూడా ఎక్కించుకుంది. అందరూ కలసి వెళుతుండగా ముందువెళుతున్న ప్రైవేటు పాఠశాల బస్సు రివర్స్ వచ్చే క్రమంలో వెనుక వస్తున్న ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. పిల్లలకు ఎలాంటి గాయాలూ కాలేదు. గాయపడిన వారిని స్థానికులు పుంగనూరు ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్రవాహనం బోల్తా.. టీచర్లకు గాయాలు

పుంగనూరు రూరల్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడి ఇద్దరు ఉపాధ్యాయులు తీవ్ర గాయాలపాలయ్యారు. మండలంలోని గూడూరుపల్లె ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ప్రకాశ్‌రావు, పెంచుపల్లెలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న భారతి దంపతులు. గురువారం విధులు పూర్తికాగానే ప్రకాశ్‌రావు తన సతీమణితో కలిసి ద్విచక్రవాహనంలో పట్టణానికి వస్తుండగా అకస్మాత్తుగా కుక్క అడ్డువచ్చింది. వెంటనే బ్రేక్ వేయడంతో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. టీచర్లు ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు వారిని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

స్మార్టు మీటర్ల ఏర్పాటుపై సీపీఎం అభ్యంతరం

పలమనేరు, నవంబరు28 : పలమనేరులో విద్యుత్ శాఖ కొత్తగా స్మార్టుమీటర్ల ఏర్పాటుకు గురువారం శ్రీకారం చుట్టింది. గురువారం పలమనేరు రిక్రియేషన్ క్లబ్ వద్ద వాణిజ్య సముదాయానికి స్మార్టుమీటరు ఏర్పాటు చేస్తుండగా సీపీఎం నాయకుడు గిరిధరగుప్తా అభ్యంతరం తెలియజేశారు. ఈ మీటర్ల ఏర్పాటును నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. కాగా ఈ విషయమై విద్యుత్ అధికారులను విచారించగా ప్రస్తుతం పలమనేరులోని ప్రభుత్వ సర్వీసులు, వాణిజ్య సర్వీసులకు మాత్రమే స్మార్టుమీటర్లను బిగిస్తున్నామని తెలియజేశారు. పలమనేరులో దాదాపు 6000 వాణిజ్యసర్వీసులు ఉన్నాయని, వీటికి స్మార్టు మీటర్లు బిగించేందుకు రెండు నెలలు పడుతుందని వివరించారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు, రామచంద్రయాదవ్

పుంగనూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో బీసీవై పార్టీ అధ్యక్షుడు బి.రామచంద్రయాదవ్ 42 రోజులుగా నిర్వహించిన ద్విచత్వారింశదిన మహాసత్ర యాగం పరిపూర్ణం సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం జరిగింది. గురువారం రాత్రి స్థానిక కొత్తఇండ్లులోని సునంద నిలయంలో శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణం, శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించారు. యాగం ముగింపు సందర్భంగా మంగళ వాయిద్యాలు, పూజా కార్యక్రమాల నడుమ అమ్మవారి విగ్రహాలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం

సోమల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సనాతన హైందవ ధర్మాన్ని కాపాడుకునేందుకు ప్రతి హిందువు నడుం బిగించాలని సనాతనధర్మ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. గురువారం పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లెలో హైందవ కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జనవరి 5వ తేదీ విజయవాడలో జరిగే హైందవ మహాసభకు భారీస్థాయిలో తరలి వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు హిమగిరి రాయల్, వేణు స్వామి, రవి ప్రభాకర్ నాయుడు, మురళి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సోమల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై వచ్చే వినతులను క్షేత్ర స్థాయి సందర్శనలతో సకాలంలో పరిష్కరించాలని ఎంపీడీవో నారాయణ తెలిపారు. గురువారం సోమల, కందూరు సచివాలయాలను ఆయన సందర్శించారు. సర్వేలు వేగవంతం చేయాలని సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, కార్యదర్శులు జయశంకర్, మజహర్‌బాషా, సర్పంచు మసూద్‌బాషా పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను మెరుగుపరచండి: జనసేన

కుప్పం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను గ్రామీణ ప్రాంతాల్లో మెరుగుపరచాలని జనసేన నియోజక వర్గ సమన్వయకర్త నరేశ్ కోరారు. స్థానిక బీఎస్ఎన్ కార్యాలయంలో గురు వారం ఆయన టెలికం ఓఎస్డీని కలిశారు. గ్రామీణ విద్యార్థులు ఆధార్ అప్డేషన్ ప్రక్రియలో బీఎస్ఎన్ఎల్ టవర్లు సరిగా పనిచేయక ఓటీపీ రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జోరుగా టీడీపీ సభ్యత్వం

పుంగనూరు, నవంబరు28(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం సభ్యత్వం తీసుకోవడానికి మైనార్టీలు క్యూ కడుతున్నారని టీడీపీ మైనార్టీ నాయకుడు సుహేల్‌బాషా తెలిపారు. గురువారం ఒక్కరోజే పట్టణంలో దాదాపు 750 మంది మైనార్టీలు టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. మైనార్టీ నాయకులు అబ్బాస్, రెడ్డెన్న పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితం నాశనం చేసుకోవద్దు

గంగవరం, నవంబరు 28,(ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ ఏఈఎస్ సుబ్రమణ్యం సూచించారు. గురువారం స్థానిక మదర్‌థెరీసా కళాశాలలో డ్రగ్స్‌వలన కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయానికి అనుగుణంగా విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి చేరాలని కోరారు. కొందరు డ్రగ్స్‌కు బానిసై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. డ్రగ్స్‌కు బానిసైతే జీవితం ముగిసినట్లేనని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఎక్సైజ్ సీఐ భాగ్యలక్ష్మి , కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్: డ్రగ్స్‌తో జీవితాలు నాశనం అవుతాయని పుంగనూరు సీఐ శ్రీనివాసులు సూచించారు. స్థానిక చైతన్య టెక్నో పాఠశాలలో మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎక్కడైనా గంజాయి, డ్రగ్స్ విక్రయాలు జరిగినట్లు తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని ఆయన కోరారు.

బలహీన వర్గాల భవిష్యత్తు ప్రదాత పూలే



పలమనేరు, కుప్పంలోని టీడీపీ కార్యాలయాల్లో జ్యోతిరావు పూలేకు నివాళులు అర్పిస్తున్న బీసీ నాయకులు

కుప్పం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాలకు భవిష్యత్తును ప్రసాదించిన దేవుడు జ్యోతిరావ్ పూలే అని టీడీపీ కుప్పం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు జేఎంసీ మురళి, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, తెలుగు యువత నియోజకవర్గ నాయకుడు చెక్కునత్తం మణిలు అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం బీసీ సెల్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావ్ పూలే 134వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● కుప్పం పురపాలక సంఘం పరిధిలోని సామగుట్టపల్లె మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు గాలి సురేశ్ ఆధ్వర్యంలో జ్యోతిరావ్ పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరులో జ్యోతిరావు పూలే వర్ధంతిని పలువురు నేతలు నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఆ పార్టీకి చెందిన నాయకులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్రమణ్యంగౌడు, నాయకులు రవి, ఆర్బీసీ కుట్టి, శ్రీనివాసులు, బ్రహ్మయ్య, ఖాజా, నాగరాజు, హరి, గిరిధర్, లోకేష్‌ఆచారి, భాస్కర్‌యాదవ్, హరిష్, రామక్రిష్ణ, సుబ్బయ్య, పురుషోత్తం, అస్లాం, రఘు పాల్గొన్నారు. ● ఆర్టీసీ బస్టాండు సమీపంలోని టవర్‌క్లాక్ వద్ద బీసీ నాయకులు జ్యోతీరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పాల్గొని జ్యోతిరావుపూలే సమాజానికి చేసిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు అద్దంకి రమణమూర్తి, గోవిందస్వామి, డి.త్యాగరాజులు, వెంకటరమణ, నంజుండప్ప, ఆనందగౌడు, గిరిధరగుప్తా, టీడీపీ నాయకులు ఆర్బీసీకుట్టి, బీజేపీ నాయకులు తాతయ్య నాయుడు, నక్కారాచంద్రయ, ప్రభాకర్ పాల్గొన్నారు. ● వైసీపీ కార్యాలయంలోనూ ఆ పార్టీ నాయకులు అంజలి ఘటించారు.

యువ ఉత్సవ్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ జగన్నాథరావు, అధ్యాపకులు

కుప్పం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా నెహ్రూ యువకేంద్ర పర్యవేక్షణలో చిత్తూరు ఆర్వీఎస్ నగర్‌లోని ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 26వ తేదీన జరిగిన యువ ఉత్సవ్ పోటీలలో కుప్పంలోని డాక్టర్ జేమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచి ప్రథమ బహుమతులు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగన్నాథరావు తెలిపారు. కళాశాలలోని అన్ని విభాగాలనుంచి మొత్తం 17 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు ఎస్.శివశంకర్, ఆర్.శామ్సున్ తయారు చేసిన 'లో కాస్ట్ మోటరైజ్డ్ ఫుడ్ ఫీడర్ ఫర్ లింబ్‌లెస్' అనే ప్రయోగం సైన్స్ మేళా టీమ్ విభాగంలో ప్రథమ బహుమతితోపాటు రూ.7 వేలు నగదు బహుమతిని పొందింది. మొదటి సంవత్సరం కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థి వై.లోహిత్ రూపొందించిన బ్లైండ్ స్టిక్ యూజింగ్ ఆర్డీవో అనే ప్రయోగం ప్రథమ బహుమతితోపాటు రూ.3 వేలు నగదు బహుమతి పొందింది. ప్రతిభ చూపి కళాశాలకు పేరుప్రతిష్ఠలు తీసుకొచ్చిన విద్యార్థులను, ఆయా విభాగాల అధిపతులను, అధ్యాపకులను ఆయన గురువారం అభినందించారు. ఇంగ్లీష్ సీనియర్ అధ్యాపకులు డాక్టర్ సయ్యద్ హుస్సేన్, జ్యోత్స్న పాల్గొన్నారు.

పులిచెర్ల అభివృద్ధికి రామ్మూర్తి కృషి ఎనలేనిది



ఎల్లంకివారిపల్లెలో రామ్మూర్తినాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

కల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే, స్వర్గీయ నారా రామ్మూర్తినాయుడు అందించిన కృషి ఎన్నటికీ మరువలేనిదని ఎంపీ టీసీ సభ్యులు మునికృష్ణమ నాయుడు, టీడీపీ నాయకులు ధనంజయనాయుడు, గోపినాయుడు తెలిపారు. పులిచెర్ల మండలం ఎల్లంకి వారిపల్లిలో గురువారం నారా రామ్మూర్తినాయుడు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం నారా రామ్మూర్తినాయుడు పెద్ద కర్మ సందర్భంగా మండలం నుంచి నారా వారిపల్లికి పెద్దఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. నారా రామ్మూర్తినాయుడుకు నివాళులు అర్పించిన వారిలో టీడీపీ నాయకులు నజీర్, ధనంజయ, గురప్ప, రాజేష్‌నాయుడు, పార్థసారధి నాయుడు, జయచంద్రనాయుడు, వనోహర్‌శెట్టి, చిన్నబ్బనాయుడు, మునీంద్ర తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి సమష్టిగా కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కుమార్

శాంతిపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి పనులు నిరాటంకంగా సాగేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషిచేయాలని శాంతిపురం ఎంపీపీ వసుంధర, జడ్పీటీసీ శ్రీనివాసులు కోరారు. గురువారం జరిగిన గ్రామాల్లో రహదారుల మర్మతులు చేపట్టాలని, మురుగుకాల్వలు నిర్మించాలని పలువురు ప్రజాప్రతినిధులు సమావేశంలో కోరారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కుమార్, వైస్ఎంపీపీ పట్టాభిశెట్టి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అసభ్యకర పోస్టులు పెడితే జైలుకే

పలమనేరు, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ఇతరులపై అసభ్యకరమైన పోస్టులు పెడితే జైలుకు వెళ్లక తప్పదని డీఎస్పీ ప్రభాకర్ హెచ్చరించారు. గురువారం పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించరాదని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. గంగవరం సీఐ ప్రసాద్, ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయం



పుంగనూరులో పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న బీసీ సంఘనాయకులు

పుంగనూరు, నవంబరు28(ఆంధ్రజ్యోతి): జ్యోతిరావు పూలే వర్ధంతిని గురువారం పుంగనూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఇందిరాసర్కిల్లో ఆయన విగ్రహానికి బీసీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో నాయకులు కృష్ణమూర్తి, అయూబ్‌ఖాన్, నరసింహులు, ప్రకాశ్, కృష్ణప్ప, గంగరాజు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద పూలే చిత్రపటానికి పూజలు చేసి నివాళులు అర్పించారు. బీసీ నాయకుడు నారాయణస్వామి, రఘునాథ్, శివప్రసాద్‌నాయుడు, చిన్ననాగరాజ, వెంకటేశు తపాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణిస్తారు

కల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుల్లో, క్రీడల్లో రాణిస్తారని ప్రభుత్వ వైద్యాధికారి జానకీరావు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.

ఆరోగ్య సంరక్షణపై అవగాహన

బైరెడ్డిపల్లె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీర్థం గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఆరోగ్య సంరక్షణపై తీర్థం పీహెచ్‌సీ వైద్యసిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. ● బైరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో వైద్యసిబ్బంది హెచ్ఐవీ, ఎయిడ్స్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆరోగ్య విద్యాధికారులు కాంతమ్మ, సావిత్రి, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సైరన్ తాళాలతో చోరీలకు చెక్

చౌడేపల్లె, నవంబరు28,(ఆంధ్రజ్యోతి): సైరన్ తాళాలతో చోరీలకు చెక్ పెట్టవచ్చని ఎస్ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఆయన బస్టాండులోని దుకాణాల యజమానులకు సైరన్ తాళాలు పంపిణీ చేశారు. దొంగలు తాళాలు బద్దలు కొడితే సైరన్ మోగు తుందన్నారు.

విద్యలో వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధచూపండి

రొంపిచెర్ల, నవంబరు28:(ఆంధ్రజ్యోతి): విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధచూపాలని ఎంఈవో శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక ఎమ్మార్సీలో 3, 4, 5 తరగతులకు బోధించే ఉపాధ్యాయులకు తరల్ (టీఏఆర్ఎల్) మెటీరియల్స్ పంపిణీ చేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

పుంగనూరు రూరల్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూల్ బస్సు అదుపుతప్పి విద్యుత్‌స్తంభాన్ని ఢీకొంది. గురువారం సాయంత్రం పాఠశాల సమయం పూర్తి కాగానే విద్యార్థులు పాఠశాల యాజమాన్యం ఏర్పాటు చేసి బస్సులో ఎక్కారు. డ్రైవర్ బస్సును రివర్స్ తీసుకునే క్రమంలో వెనుక ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. వెంటనే విద్యార్థులు బస్సులో నుంచి కిందకు దిగేశారు. కాగా విద్యుత్ వైర్లు పూర్తిగా తెగపోవడంతో కరెంటు సరఫరా ఆగిపోవడంతో ప్రమాదం తప్పింది.

యువకుడికి గాయాలు

పుంగనూరు రూరల్, నవంబరు28(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని బస్టాండ్ సమీపంలో నివాసం ఉంటున్న ప్రభాకర్ కుమారుడు టి.ప్రదీప్(18) మద్యం తాగి ద్విచక్ర వాహనంలో వస్తూ టోల్‌గేట్ సమీపంలో పడి గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి పుంగనూరు ఆస్పత్రికి తరలించారు.

ఖోఖో విజేత పుదిపట్ల



గెలుపొందిన పుదిపట్ల సీనియర్ బాలురు, బాలికల జట్లు

చౌడేపల్లె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జోనల్ స్థాయి ఖోఖో పోటీల్లో పుదిపట్ల విజేతగా నిలిచింది. గురువారం మండలంలోని పుదిపట్ల హైస్కూల్లో జోనల్ స్థాయి బాలుర, బాలికల ఖోఖో క్రీడా పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 25 జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో సీనియర్ బాలుర, బాలికల విభాగంలో పుదిపట్ల హైస్కూల్ జట్లు గెలుపొందాయి. రన్నరప్‌గా జడ్పీహెచ్ఎస్ చౌడేపల్లె బాలుర జట్టు, జడ్పీహెచ్ఎస్ రొంపిచెర్ల జట్లు నిలిచాయి. జూనియర్ బాలురలో విజయవాణి హైస్కూల్ జట్టు గెలుపొందింది. జూనియర్ బాలికల విజేతగా జడ్పీహెచ్ఎస్ పుదిపట్ల, రన్నరప్‌గా మున్సిపల్ హైస్కూల్ మేలుపట్ల జట్లు గెలుపొందాయి. విద్యార్థులు చదువుతోపాటూ క్రీడల్లో రాణించడం వల్ల మానసికోల్లాసం పొందుతారని ఎంఈవో కేశవరెడ్డి అన్నారు. ఈ క్రీడల నిర్వహణలో హెచ్ఎం పద్మజ, సీనియర్ పీఈటీ రామచంద్రయ్య, కమిటీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, గ్రామస్తులు వినోద్‌కుమార్‌రెడ్డి, ఉదయ్ కుమార్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన స్టాల్ ప్రారంభం


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): 2030 నాటికి హెచ్ఐవీ లేని సమాజమే లక్ష్యంగా పనిచేయాలని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి కోరారు. స్థానిక గాంధీ విగ్రహం ఎదుట గురువారం జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణ శాఖ(దిశా) ఆధ్వర్యంలో అవగాహన స్టాల్‌ను ఆమె ప్రారంభించారు. స్టాల్ గురువారం నుంచి ఈనెల 30 వరకు రోజూ సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, ఎడిపిడమాలజిస్ట్ శ్రీవాణి, డెమో జయరాముడు పాల్గొన్నారు. ● హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై లారీ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తూ మురకంబట్టులోని లారీ అసోసియేషన్ కార్యాలయం వద్ద అపోలో నర్సింగ్ విద్యార్థులు ప్రదర్శించిన వీధి నాటకం ఆకట్టుకుంది.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి


అధికారులకు సూచనలిస్తున్న హౌసింగ్ పీడీ

గంగాధరనెల్లూరు, నవంబరు 28: లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణ పనులు వందరోజుల్లో పూర్తి చేయించాలని జిల్లా హౌసింగ్ పీడీ పద్మనాభం కోరారు. కోటాగరం పంచాయతీ ఒడ్డుపల్లెలో లేఅవుట్‌లోని ఇళ్లను ఆయన గురువారం పరిశీలించారు. గత ప్రభుత్వంలో మంజూరై పూర్తికాని ఇళ్లను గుర్తించాలన్నారు. వెంటనే పనులు చేపట్టేలా చూడాలన్నారు. ఈపనులకు సంబంధించి వివరాలను సేకరిస్తున్నామన్నారు. ఆయన వెంట మండల హౌసింగ్ ఏఈ శ్రీధర్, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు గీత, నరేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


పూతలపట్టు ఉన్నత పాఠశాలలో వైద్యపరీక్షలు

పూతలపట్టు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక ప్రాథమిక వైద్యశాల సిబ్బంది గురువారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్య జాగ్రత్తలపై వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమెతో పాటు సీహెచ్‌వో శ్రీనివాసమూర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ●యాదమరి: యాదమరి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంఈవో రుక్మిణి వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్, హెచ్‌ఎం గిరిరాజా, సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, లక్ష్మీపతి, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడి మృతికి సంతాపం

చిత్తూరు అర్బన్, నవంబరు 28: పారిశుధ్య కార్మికుడు వినోద్ మృతిపై మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్ సంతాపం వ్యక్తం చేశారు. గురువారం మున్సిపల్ లేన్‌లోని గృహానికి వెళ్లి కార్మికునికినివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మట్టి ఖర్చుల కోసం నగరపాలక సంస్థ నుంచి రూ.15వేలు అందించారు. ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లోకనాథం తదితరులు నివాళులు అర్పించారు.

హైరోడ్డు విస్తరణ పనులకు మార్కింగ్



చిత్తూరు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలో హైరోడ్డు విస్తరణ చేపట్టే ప్రాంతాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు గురువారం మార్కింగ్ చేశారు. రోడ్డు విస్తరణలో కోర్టు స్థలం కొంత వరకు పోయే అవకాశం ఉంది. కమిషనర్ నరసింహ ప్రసాద్, ఏసీపీ నాగేంద్రలు జడ్జిని కలిసి ఈమేరకు వివరించారు. రోడ్డు విస్తరణలో కోర్టు స్థలం ఎంత అవసరం ఉందో ముందుగా సర్వే చేయాలని అధికారులకు సూచించారు.

టీడీపీ సభ్యత్వ నమోదుతో భవిష్యత్తుకు భరోసా

నగరి, నవంబరు28 (ఆంధ్రజ్యోతి):టీడీపీ సభ్యత్వ నమోదుతో భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ పేర్కొన్నారు. గుండ్రాజుకుప్పం దళితవాడలో ఎస్‌జీసెల్ నాయకులు అలెక్స్ రాజా, రవికుమార్. జయపాల్‌ల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు జోరుగా సాగుతోంది. నియోజకవర్గంలో 29450 మంది సభ్యత్వం తీసుకున్నారు. సభ్యత్వ నమోదులో నగరి నియోజకవర్గం ప్రథమ స్థానంలో వచ్చేలా ఎంఎల్‌ఏ భానుప్రకాష్ నాయకులకు సూచనలిస్తున్నారు.

గోకులం షెడ్ల పనులను వేగవంతం చేయండి


గోకులం షెడ్డును పరిశీలిస్తున్న డ్వామా పీడీ రవికుమార్

పాలసముద్రం,నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో గోకులం షెడ్ల నిర్మాణ పనులను గురువారం డ్వామా పీడీ రవికుమార్ పరిశీలించారు. ఆముదాల, బాలకృష్ణాపురం పంచాయతీల్లో గోకులం షెడ్లను పరిశీలించి లబ్ధిదారులకు సూచనలు చేశారు. త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. సకాలంలో పూర్తి చేస్తే బిల్లులు అందజేస్తామన్నారు. ఏపీవో మార్గరేట్, ఈసీ అనూష, టీఏలు,ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విపత్తుపై అవగాహన

వెదురుకుప్పం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ విపత్తును సమష్టిగా ఎదుర్కొందామని పచ్చికాపల్లం జడ్పీ ఉన్నత కళాశాల ప్రధానోపాధ్యాయుడు పోతగంటి సిద్ధయ్య పేర్కొన్నారు. శుక్రవారం పచ్చికాపల్లంలో ప్లాస్టిక్ సంచులు, పాలిథిన్ కవర్ల వల్ల కలిగే అనర్థాలను ఆయన వివరించారు. తర్వాత ఇంటింటికీ విద్యార్థులతో కలసి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్లాస్టిక్‌తో ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు.

పోలీసు భార్యకు ఎస్పీ ఆర్థిక సాయం


రమాదేవికి చెక్కు అందిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె హెడ్‌కానిస్టేబుల్ చలపతి కుటుంబానికి గురువారం ఎస్పీ మణికంఠ ఆర్థికసాయాన్ని అందించారు. ఈ ఏడాది సెప్టెంబరు 29న చలపతి అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి భార్య రమాదేవికి విడో ఫండ్ నుంచి రూ. 50వేలు, ఫ్లాగ్‌ఫండ్ నుంచి రూ. 25వేలు అందించారు. ఐరాల మండల పోలీసు స్టేషన్‌లో పనిచేస్తూ అక్టోబరు 23న మృతి చెందిన హెడ్‌కానిస్టేబుల్ వెంకటరమణ భార్య రాణికి కూడా ఆర్థిక సహాయం అందించారు

నేడు జిల్లా స్థాయి త్రోబాల్ పోటీల ప్రారంభం

పూతలపట్టు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం జిల్లాస్థాయి త్రోబాల్ పోటీలు నిర్వహించనున్నారు. పోటీలను శుక్రవారం ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టర్ ప్రారంభిస్తారని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

టీచర్లను వేధించడం తగదు : ఆపస్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం టీచర్లను వేధించడం తగదని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెసిడెన్షియల్ ట్రైనింగ్‌ను ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకించినా మళ్లీ సుదూర ప్రాంతల్లో ఏర్పాటు చేయడం తగదన్నారు. ఇప్పటికే విజయనగరం జిల్లాలో ఒక ఉపాధ్యాయుడున్ని కోల్పోయామన్నారు. తాజాగా బడి పనివేళలు పెంచడం, సెలవులను పది శాతానికి పరిమితి చేయడం తగదన్నారు.

30న విభిన్న ప్రతిభావంతులకు క్రీడాపోటీలు

చిత్తూరు క్రీడలు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఈనెల 30న బీఎస్‌కణ్ణన్ స్కూల్‌గ్రౌండ్‌లో విభిన్న ప్రతిభావంతులకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీవో బాలజీ ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు పోటీలో పాల్గొనవచ్చునన్నారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలు

చిత్తూరు క్రీడలు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం మందడంలోని గుడ్రోల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఈనెల 30, డిసెంబరు 1వ తేదీల్లో రాష్ట్ర స్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. చిత్తూరు డీఎస్‌డీవో బాలాజీ ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, అండర్-16, అండర్-18 బాలబాలికల విభాగంలో పోటీలు జరుగుతాయన్నారు. వివరాలకు 9849379932, 9708092077 నంబర్లలో సంప్రదించాలని సూచించారు

8న పెన్షనర్ల సమావేశం

చిత్తూరు కల్చరల్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో జిల్లా సంఘ సర్వసభ్య సమావేశం డిసెంబరు 8న పెన్షనర్ల సంఘ భవనంలో నిర్వహించనున్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి మురుగానందం గురువారం ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు.

హత్యాయత్నం : నిందితుడి అరెస్టు

చిత్తూరు అర్బన్, నవంబరు 28: పాతకక్షల కారణంగా ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ నెట్టికంఠయ్య వివరాల మేరకు... నగరంలోని కైలాపురానికి చెందిన విఘ్నేష్‌కు, అదే ప్రాంతానికి చెందిన మహేంద్రకు పాతకక్షలు ఉన్నాయి. ఈక్రమంలో ఈ నెల 25న కత్తితో విఘ్నేష్‌పై మహేష్ దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం మహేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

పాలసముద్రం,నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారం కాకుండా ఇష్టానుసారం భోజనం పెడుతున్నారంటూ డీఈవో వరలక్ష్మి ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం ఆమె పాలసముద్రం,ఎస్‌ఆర్‌కండ్రిగ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. పాలసముద్రం పాఠశాలలో మెనూ ప్రకారం సాంబారు అన్నానికి బదులు లెమన్ రైస్ పెట్టారు. స్టోర్‌రూమ్, వంట గది పరిశుభ్రంగా లేకపోవడంతో హెచ్‌ఎంను ప్రశ్నించారు. ఇవపై విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని ఆదేశించారు. ఎస్‌ఆర్‌కండ్రిగ జడ్పీ హైస్కూల్‌లో మెనూ ప్రకారం భోజనం పెట్టారు. వరలక్ష్మి భోజనం రుచి చూశారు. భోజనం బాగుందని కితాబు ఇచ్చారు. ఆమె వెంట ఎంఈవో రాజేంద్రప్రసాద్, ఎస్‌ఆర్‌కండ్రిగ పాఠశాల హెచ్‌ఎం రఘు తదితరులు పాల్గొన్నారు.

దళితులకు న్యాయం చేయండి

వెదురుకుప్పం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మాంబేడులో దళితులకు న్యాయం జరగకపోతే తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన రాజేంద్ర భూములోనిఇ చెట్లను అగ్రవర్ణాల వారు దౌర్జన్యంగా తొలగిస్తున్నారన్నారు. గతంలో కూడా ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదన్నారు. దళితులకు న్యాయం చేయకపోతే బాధితులతో కలసి తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. తహసీల్దార్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కరువు రాయితీలపై అన్నదాతల ఆశలు


నీరు లేని దళవాయిపల్లె నాయినిచెరువు

యాదమరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కరువు పరిస్థితుల నేపథ్యంలో తమను ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికే యాదమరిని కరువు మండలంగా ప్రకటించడంలో వీరంతా ఊరట చెందారు. కరువు మండలానికి వర్తించే రాయితీలు, ప్రోత్సాహకాలు అందించి తమను ప్రభుత్వం ఆదుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ మొదలయ్యాక వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. వేరుశనగ, కంది, ఉలవలు, శనగలు, మిర్చి, కూరగాయల పంటలు ఎండిపోయాయి. తామంతా నష్టపోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇరిగేషన్ శాఖ పరిధిలోని నుంజర్ల, గూటాలవంక, కుక్కలపల్లి బొందంచెరువుల్లో 20శాతం మాత్రమే నీరు ఉంది. మిగిలిన 60 చిన్న చెరువులూ వెలవెలపోతున్నాయి. 4800 హెక్టార్లలో మామిడి, వెయ్యి హెక్టార్లలో కొబ్బరి, మిగిలిన 1400 హెక్టార్లలో నీటి లభ్యత ఆధారంగా సాధారణ, వర్షాధార పంటలు రైతులు సాగు చేస్తున్నారు. వరుణుడు ముఖం చాటేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వలసలు కట్టడికి చర్యలు

నీవానదిలో ఇసుక తోడేస్తుండటంతో భూగర్భజలాలు తగ్గే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కరువు మరింత తాండవిస్తుందని అన్నదాతలు కలవరపడుతున్నారు. కరువు మండలాలకు వ్యవసాయ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కొన్ని పథకాలు వర్తిస్తాయి. జీవనోపాధి మెరుగుకు, పంట నష్టాలను తగ్గించడానికి, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆర్థిక సాయం చేయడానికి ఇవి ఉపయోగపడతాయి. వీటిని వెంటనే ప్రకటించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇన్పుట్ సబ్సిడీ, విత్తనాలు,ఉచిత ఎరువుల కోసం వీరు ఎదురుచూస్తున్నారు. రుణమాఫీ అమలు చేయాలని అభ్యర్థిస్తున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని వలస కట్టడికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలంటున్నారు. వేరుశనగ బాధిత రైతులకు ప్రభుతవం బీమా సహాయం, విత్తనాలను అందిస్తుందని వ్యవసాయ అధికారి చరిత చెప్పారు. ఉపాధి హామీ కింద జాబ్‌కార్డున్న వారందరికీ వందరోజుల పని కల్పిస్తామని ఏపీవో బాల తెలిపారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. డిసెంబరు 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆయన బ్యానర్లను,పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2030 నాటికి హెచ్ఐవీ లేని సమాజస్థాపనే అందరి లక్ష్యమన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ప్రభావతీదేవి, అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, వ్యాధి నిరోధక టీకాల అధికారి హనుమంత రావు, ఆర్బీఎస్‌కే కోఆర్డినేటర్ శిరీష పాల్గొన్నారు.

పూలేకు ఘన నివాళులు


జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీఆర్వో మోహన్‌కుమార్

చిత్తూరు అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం పోరాడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని డీఆర్వో మోహన్ కుమార్ అన్నారు. గురువారం పాత గ్రీవెన్స్ హాలులో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు. పలువురు అధికారులు పాల్గొన్నారు. ●చిత్తూరు రూరల్: పీసీఆర్ సర్కిల్ వద్ద పూలే విగ్రహానికి డీపీహెచ్‌ఎస్ నాగరాజు పూలమాల వేసి నివాళి అర్పించారు. సీపీఐ నాయకులు గోపీనాథ్, మహేష్, రఘు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు. ●పూతలపట్టు: చిత్తూరు-తిరుపతి జాతీయ రహదారి పక్కన వున్న పూలే విగ్రహానికి దళిత నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ●చిత్తూరు సెంట్రల్: పూలే విగ్రహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరచౌదరి, జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు నివాళులర్పించారు. ●నగరి: పట్టణ పరిధిలో జైభీమ్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రన్,కాంగ్రెస్‌పార్టీ ఏఐసీసీ కార్యదర్శి బాబుల ఆధ్వర్యంలో పూలేకు నివాళులర్పించారు. ●చిత్తూరు సిటీ: జిల్లా టీడీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి టీడీపీ నేతలు పూలమాలవేశారు.

నెట్టేరిలో శాస్త్రవేత్తల బృందం పర్యటన



నింద్ర, నవంబర్ 28(ఆంధ్రజ్యోతి): నెట్టేరి గ్రామంలో గురువారం ప్రాంతీయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. వరి, మినుము పంటలను పరిశీలించింది. పంటలో పురుగుల నివారణ, తెగుళ్ల, ఆకుముడత, కాండం కుళ్లు తెగుళ్లపై రైతులకు, స్థానిక వ్యవసాయధికారులకు, సిబ్బందికి శాస్త్రవేత్తలు లత, హేమలత, హారతి అవగాహన కల్పించారు.

డిగ్రీ కళాశాల విద్యార్థుల రక్తదానం


రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ఇస్తున్న ప్రిన్సిపాల్ విజయులురెడ్డి తదితరులు

వెదురుకుప్పం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అన్ని దానాలకంటే రక్తదానం మిన్న అని కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయులురెడ్డి అన్నారు. గురువారం కార్వేటినగరం డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్‌సీసీ సంయుక్తంగా స్విమ్స్ బ్లడ్ బ్యాంకు వారి సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటరు డాక్టర్ ధనంజయరెడ్డి, డాక్టర్ సీఎస్ లత, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ హరిబాబు, డాక్టర్ రఘు, డాక్టర్ బాబు, డాక్టర్ సురేష్, కార్తీక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పురందరేశ్వరిని కలసిన బీజేపీ నేత రాజేంద్రన్



శ్రీరంగరాజపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం మర్రిపల్లె గ్రామానికి చెందిన గంగాధర నెల్లూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రాజేంద్రన్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందరేశ్వరిని గురువారం రేణిగుంట విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించారు. నియోజకవర సమస్యలను వివరించామని రాజేంద్రన్ తెలిపారు.

సీడ్ సర్వే పరిశీలన

గంగాధరనెల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పందులు మేపుతూ జీవనం సాగించే కుటుంబాలకు ప్రభుత్వం అన్ని మౌలిక వసతులు కల్పిస్తుందని జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి చెప్పారు. గంగాధరనెల్లూరు పీహెచ్‌సీకి వెళ్ళే రహదారి పందులను మేపుతున్న కుటుంబాలతో గురువారం ఆమె మాట్లాడారు. సీడ్ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ పందులపై ఆధారపడిన వారి జీవన స్థితిగతులను జిల్లా అధికారులకు నివేదిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శులు చంద్ర, కుమార్, దుర్గాప్రసాద్‌లు పాల్గొన్నారు.

రికార్డులు లేని వాహనాల సీజ్

పాలసముద్రం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రికార్డులు లేకుండా తిరుగుతున్న ఓ వ్యాను, మోటారు సైకిల్‌ను నగరి ఆర్టీవో బ్రేక్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరెడ్డి గురువారం తనిఖీ చేసి సీజ్ చేశారు. వాహన చోదకులు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని, రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని ఆయన తెలిపారు.

కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం

చిత్తూరు సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో ప్రతి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. గురువారం నగరంలోని 25వ వార్డు బొండు వీధిలో టీడీపీ కార్యకర్త రామయ్య మృతిచెందారు. ఎమ్మెల్యే ఆదేశాలతో పార్టీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్ పార్టీ తరఫున మట్టి ఖర్చుల కింద ఆయన కుటుంబానికి రూ.10వేలు అందించారు.

తూగుండ్రంలో భజనగీతాలు

గంగాధరనెల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తూగుండ్రంలో ఇస్కాన్ టెంపుల్‌కు చెందిన కీర్తి గోపాల్‌దాస్, ధన్య గోపాల్ దాస్‌ల ఆధ్వర్యంలో పలువురు గురువారం భజనగీతాలను ఆలపించారు.


నారావారిపల్లెలో గురువారం మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యేలు గాలి భానుప్రకాష్(నగరి), థామస్(జీడీ నెల్లూరు)- ముఖ్యమంత్రి చంద్రబాబును పరామర్శిస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

కుటుంబ కలహాలతో ఆత్మహత్య


వెంకటేశులు మృతదేహం

యాదమరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఈశ్వర్ వివరాల మేరకు బుడిగిమానుపెంటకు చెందిన వెంకటేశులు (40) భార్యతో డ్వాక్రా రుణం విషయంలో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం విషం తాగాడు. స్థానికులు గుర్తించి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించాడు. వెంకటేశులు కూలీ పనులకు వెళ్ళేవాడు. కుమారుడు, కుమార్తె ఉన్నారు.

త్రయోదశి ప్రదోష పూజలు

చిత్తూరు కల్చరల్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): నగరంలోని శివాలయాల్లో గురువారం త్రయోదశి ప్రదోష పూజలను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. గిరింపేట శివగామి సుందరి సమేత దంబరేశ్వర ఆలయంలో రుద్రాభిషేకం, హోమం నిర్వహించగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కట్టమంచి కులందేశ్వర ఆలయంలో అభిషేకం చేశారు.

ప్రభుత్వ విప్ థామస్‌కు సత్కారం

వెదురుకుప్పం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్‌ను గురువారం స్థానిక టీడీపీ నాయకులు కలిశారు. ఆయనకు తిరుపతి రుయా ఆస్పత్రి మాజీ చైర్మన్ చినబాబుకు శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పోటుగారి గంగయ్య, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి బీఎం రవి, క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి తదితరులు ఉన్నారు

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

పాలసముద్రం,నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వరదుర్గాపురంలో నాగరాజు అనే వ్యక్తిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. తనను కులం పేరుతో దూషించి దాచి చేశాడని వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేశామన్నారు. నాగరాజును అరెస్టు చేశామన్నారు.